Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు · స్థాపితం: 1930 · జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

*Longest Living Newspaper in Telugu Journalism*

# జమీన్ రైతు

సంపుటి: 81 • సంచిక: 2 • 8-1-2010 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

షైన్
సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల
హాస్పిటల్ ప్రత్యేకతలు
పూర్తిగా/పాక్షికంగా కదులుతున్న పళ్ళతో బాధపడుతున్న వారికి అత్యాధునిక పద్ధతిలో ఫిక్స్‌డ్ పళ్ళు అమర్చుట.
ఇంప్లాంటేషన్.
ఎత్తుపళ్ళు, వంకరపళ్ళు సరిచేసే చికిత్స.
రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్.
డా॥ SK. మహమ్మద్ అలి
కాస్మెటిక్ డెంటల్ సర్జన్
16-1064, హోటల్ వెంకటరమణ లైన్, పొగతోట, నెల్లూరు -524 001.
ఫోన్ : 0861 - 2340032

లేజర్ చికిత్స
అత్యంత అధునాతన లేజర్ పరికరంతో చిగుళ్ళ వ్యాధులకు ప్రత్యేక చికిత్స
7గురు స్పెషలిస్టు డాక్టర్లు కలిగిన ఏకైక సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల.
రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు వారి కుటుంబసభ్యులకు రీయింబర్స్‌మెంట్ సదుపాయం
డాక్టర్ అల్లూరు స్వరూపకుమార్‌రెడ్డి, MDS
Professor, Endodontics
కేర్ సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల
పొగతోట, నెల్లూరు. ఫోన్: 2303300

## గవర్నర్ నివేదికలో నక్సల్స్ భూతం!

రాష్ట్రంలో పరిస్థితుల మీద తాత్కాలిక గవర్నర్ నరసింహన్ ఇచ్చిన నివేదిక కేంద్ర ప్రభుత్వాన్ని భయపెట్టే తీరులో వుందని వినికిడి. ఎన్.డి.తివారీ స్థానంలో వచ్చిన ఆయన రాజ్‌భవన్‌లో వున్నది నాలు గంటే నాలుగు రోజులు. ఈ కొద్ది సమయంలో రాష్ట్రానికి చెందిన రాజకీయ నాయకులు, పోలీసు అధికారులు, సాధారణ ప్రజలను పెద్ద ఎత్తున కల్సి వారి నుంచి తనకు కావాల్సిన సమాచారాన్ని రాబట్టి, ఒక నివేదిక తయారు చేసి పంపాడు. రాజ్‌భవన్ ఉద్యోగులకు కనీసం దాన్ని టైప్ చేసే అవకాశం కూడా ఇవ్వలేదు. తన ల్యాప్‌టాప్‌లో తానే వ్రాసుకొని, వెంట తీసుకొని వెళ్లాడు. రాష్ట్రంలో అణగారిపోయిందనుకొన్న వామపక్ష తీవ్రవాద భావనలకు ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మళ్లీ బీజాలు వేస్తున్నదని ఆ నివేదిక సారాంశం. ఈ ఉద్యమాన్ని నక్సలైట్లు తమ చెప్పుచేతలలో పెట్టుకొంటున్నారని, ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాలలో ఏర్పడిన విద్యార్థుల జాయింట్ యాక్షన్ కమిటీలోని సభ్యులలో

కొరవ 14వ పేజీలో

● ఇదీ కేంద్రం తీరు

# ఇచ్చేది లేదు, ఇవ్వమని చెప్పేదీ లేదు!

తెలంగాణ సమస్య త్రిశంకు స్వర్గంలో చిక్కుకొన్నది. స్వర్గానికి ఎగిరే శక్తిలేదు. భూమి మీదకు దింపడం ఎవరికీ చేత కావడం లేదు. అటు ఇటు కాకుండా మధ్యలో తేలియాడుతున్నది. 5తేది ఢిల్లీలో జరిపిన అఖిలపక్ష సమావేశం పరిస్థితిని మరింత జఠిలం చేసిందే తప్ప ప్రతిష్టంబనకు పరిష్కారం చూపలేదు. సిద్దడు అద్దంకి పోనూ పోయాడు, రానూ వచ్చాడన్నట్లు రాష్ట్రానికి చెందిన పార్టీలన్నీ పాలోమని ఢిల్లీ విమానం ఎక్కి వెళ్లాయి, తిరిగి వచ్చాయి. పోయేటప్పటి కంటే తిరిగి వచ్చేటప్పుడు మరింత అయోమయానికి లోనైనాయి. ఈ సమావేశంలో కేంద్ర హోంమంత్రి చిదంబరం తెలంగాణ ఇస్తానని చెప్పలేదు. ఇవ్వబోమనీ చెప్పలేదు. ఎవరికివారు ఈ సమావేశం తమకు అనుకూలమని చెప్పుకొనే అవకాశం మాత్రం కల్పించాడు. సమావేశం తర్వాత ఇటు సమైక్యవాదులు, అటు తెలంగాణ ఉద్యమకారులు కూడా సంతృప్తి వ్యక్తం చేయడంలోనే చిదంబరం మాయాజాలం ప్రస్ఫుటమౌతున్నది.

కెసిఆర్ నిరాహారదీక్షపై తమకందిన తప్పుడు సమాచారంతో డిసెంబర్ 9తేది తాను చేసిన ప్రకటన ఎంత పొరపాటో ఆలస్యంగా అర్థం చేసుకొన్నాడు చిదంబరం. దాన్ని సరిదిద్దుకోవడానికి ఇప్పుడు ఆచితూచి అడుగులు వేస్తున్నాడు. అందులో ఒకభాగమే అఖిలపక్ష సమావేశం. ఈ సమావేశంలో జరిగింది ఏమీ లేదు, సాధించింది అసలే లేదు. కానీ ఆ తర్వాత ఒక్కొక్క పార్టీ నేతలను విడివిడిగా కలిసి, వారు చెప్పింది ఓపికగా విని, తన బాధను వివరించి చెప్పి, పరిస్థితిని తన కనుకూలంగా మలచుకోవడానికి నేర్పుగా వ్యవహరిస్తున్నారాయన.

### ఇస్తే అల్లరి ఇవ్వకుంటే అలజడి

తెలంగాణ ఎంత సంక్లిష్ట సమస్యో కేంద్ర ప్రభుత్వానికి ఇప్పుడు కానీ అర్థం కాలేదు. ఇస్తే, అల్లరి రేగుతుంది. ఇవ్వనని చెప్తే అలజడి చెలరేగుతుంది. నిర్ణయం ఏదైనా సమస్యను మరింత జఠిలం చేస్తుందే తప్ప పరిష్కారం చూపదు. ఈ గండం గట్టెక్కాలంటే మధ్యే మార్గమే పరమోత్తమం. ఇవ్వకూడదు, ఇవ్వనని చెప్పనూ కూడదు. సాధ్యమైనన్ని రోజులు నాన్చుడు వైఖరి అవలంభించడం తప్ప వేరే దారి లేదు. సూటిగా ఒక్క ముక్కలో చెప్పాలంటే అఖిలపక్ష సమావేశం సారాంశం ఇది మాత్రమే. చాలా నేర్పుగా ఈ గారడీ విద్య ప్రదర్శిస్తున్నాడు చిదంబరం.

తెలంగాణపై చర్చలకు ప్రాతిపదిక తయారు చేయడానికి ఒక కమిటీ నియమించాలన్నది ఈ మధ్యే మార్గంలో ఒక భాగం. ఆ కమిటీ వివిధ సంఘాలు, వ్యక్తులు, పార్టీలతో విస్తృతస్థాయి చర్చలు జరిపి, రాష్ట్ర విభజనకు ఏఏ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలో నిర్ణయిస్తుంది. ఆ తర్వాత మరొక కమిటీ ఏర్పాటుచేసి, ఆ అంశాలపై చర్చలు మొదలు పెడుతుంది. స్థూలంగా చిదంబరం ప్రతిపాదనల సారాంశం ఇంతే.




### నాలుగు అడుగులు వెనక్కు

అఖిలపక్ష సమావేశం సమస్య పరిష్కారానికి ఒక ముందడుగని ప్రకటించాడు చిదంబరం. కానీ దీనివల్ల తమ ఉద్యమం నాలుగు అడుగులు వెనక్కు వెళ్తుందన్న భీతి, భయం తెలంగాణవాదులలో కలుగుతున్నది. చర్చలకు ఏ అంశాలు తీసుకోవాలో నిర్ణయించడానికి ఒక కమిటీ, ఆ తర్వాత చర్చలకు మరొక కమిటీ, వాటిలో తలెత్తే వివాదాల పరిష్కారానికి ఆ పైన ఇంకొక కమిటీ, ఇట్లా కమిటీలతో ఏళ్లు పూళ్లు కాలక్షేపం జరిగితే అన్ని రోజులపాటు ఉద్యమాన్ని నిలువరించడం ఎట్లా సాధ్యమన్నది వారి భయం. అది నిజం కూడా. అట్లని చిదంబరం ప్రతిపాదనను పూర్తిగా తిరస్కరించడానికి కెసిఆర్ సాహసించలేక పోతున్నాడు. సమావేశం తర్వాత తనను వ్యక్తిగతంగా కలిసిన సమయంలో కెసిఆర్‌కు చాలా స్పష్టంగా చెప్పాడట చిదంబరం, ఇప్పటికిప్పుడు తెలంగాణ ఇచ్చి తీరాలని పట్టుపడితే జరిగే పనికాదని. నిరా

కొరవ 14వ పేజీలో

## కార్టూన్ స్కేప్




బండ్ల షాక్ నుండి కోలుకోకముందే కరెంట్ షాక్‌లట...!

బలమైన, ఆరోగ్యకరమైన దంతాలకు ఒకే ఒక్క చిరునామా! "స్మైల్"
పళ్లమధ్య సందులు, ఎత్తుపళ్లు, వంకరపళ్లను స్మైల్ డిజైనింగ్ ద్వారా ఒక్కరోజులో సరిచేయవచ్చును.
ప్రభుత్వోద్యోగులకు అరుదైన అవకాశం. నెలసరి వాయిదాలలో వైద్యఖర్చులను చెల్లించే సదుపాయం.
స్మైల్ సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్
ఫోన్: 0861-2344693, 92464 34447
నెల్లూరులో ప్రప్రథమంగా ISO 9001-2000 గుర్తింపు పొందిన డెంటల్ హాస్పిటల్

# బాదుడు ఆపండి

రాష్ట్ర ఖజానాకు కాసులు రాబట్టడానికి జనం జేబుల్లో చెయ్యి పెడుతున్నాడు ముఖ్యమంత్రి రోశయ్య. ఒకేసారి పలు రకాల పన్నుల పెంపుకు, ఛార్జీల హెచ్చింపుకు ప్రయత్నిస్తున్నాడు. రాష్ట్ర ప్రభుత్వ రాబడికి, ఖర్చుకు పొంతనలేని మాట నిజమే. ప్రభుత్వం చేపట్టిన పలు పథకాలు, ప్రాజెక్టులు నిధులు లేక నిలిచిపోయిన మాట కూడా నిజమే. అయితే ఆ తప్పు ప్రభుత్వానిదే తప్ప ప్రజలది కాదు. ఎన్నికలలో గెలవడానికి, ప్రజలను ఆకట్టుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అలివిమాలిన పథకాలను తలకెత్తుకొన్నది. శక్తికి మించి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టింది. అందుకోసం బడ్జెట్ పరిమాణాన్ని లక్ష కోట్లకు పెంచింది. వాస్తవిక ఆదాయ అంచనాలతో రూపొందించిన బడ్జెట్ కాదది. కాకి లెక్కలతో చేసిన గారడీ.

ఆ తప్పుడు లెక్కలను సరిచేసుకోవడానికి జనం జేబులు కత్తిరించాలనుకోవడం ఆర్థికపరంగా చూస్తే అజ్ఞానం, రాజకీయంగా చూస్తే ఆత్మహత్యా సదృశ్యం. గత ఇరవయ్యేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవచిస్తున్న ఆర్థిక సంస్కరణల మౌలిక సూత్రానికి విరుద్ధమైన పోకడ ఇది. ప్రభుత్వ రాబడి పెంచుకోవడానికి పన్నుల పెంపకం కంటే, పన్నుల పరిధి పెంచడం సరైన మార్గమని 1990 దశకంలోనే అప్పటికి ఆర్థిక మంత్రిగా వున్న ఇప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఆర్థికసంస్కరణలు ప్రవేశపెట్టాడు. ఆనాటి నుంచి ఆర్థిక మంత్రులందరూ ఆ మార్గదర్శకత్వంలోనే నడుస్తున్నారు. ఇప్పుడా దారి తప్పి నడవాలనే ఆలోచన రోశయ్యకు ఎందుకు వచ్చిందో అర్థం కావడం లేదు.

జమీన్‌రైతు

ఆర్టీసి ఛార్జీలు అమితంగా పెంచారు. కరెంటు ఛార్జీలను కూడా మోత మోగించబోతున్నారని వార్తలొస్తున్నాయి. అన్ని వస్తువుల మీద అమ్మకం పన్ను పెంచబోతున్నారు. మద్యం ధరలు మరింత పైకి తీసుకవెళ్తారట. ఇసుకనుకూడా వదలిపెట్టడం లేదు. ఒకేసారి ఇన్ని పన్నుల భారం పైన పడితే ప్రజల జీవితాలు ఎంత అల్లకల్లోలం అవుతాయో ముఖ్యమంత్రి గమనించడం లేదు. అసలే ఆర్థికమాంద్యంతో, తగ్గిన జీతాలతో, తరిగిపోయిన వ్యాపారాలతో, భవిష్యత్తు మీద అనుమానాలతో, భయాలతో అతలాకుతలం అవుతున్న సాధారణ ప్రజానీకాన్ని ధరలనే దుడ్డు కర్రతో చావబాదాలనుకోవడం అన్యాయం.

రాష్ట్ర ప్రభుత్వం మీద ఆర్థిక ఒత్తిడి పెరగడానికి అసలు కారణం తలకు మించి పెంచుకొన్న ఖర్చులు మాత్రమే. ఆర్థిక మాంద్యం అందుకు తోడైంది. అయితే బడ్జెట్‌ను లక్ష కోట్లకు పెంచమని ఏ ప్రజలూ కోరలేదు. ఒకేసారి లెక్కలేనన్ని ప్రాజెక్టులు, పథకాలు చేపట్టమని ఏ ప్రజలూ ఒత్తిడి తేలేదు. అవి రెండూ ప్రభుత్వాన్ని నడిపే వారు తమ రాజకీయ అవసరాల కోసం తీసుకొన్న తప్పుడు నిర్ణయాలే. ఇప్పుడు ఆ తప్పులకు ప్రజలను శిక్ష అనుభవించమని కోరడం మరింత పెద్ద నేరం.

రాబడికి, ఖర్చుకు పొంతన కుదరనప్పుడు ప్రభుత్వం మొదట చేయవలసిన పని ఖర్చు తగ్గించుకోవడం. శక్తి చాలదని తెలిసీ చేపట్టిన ప్రాజెక్టులను, పథకాలను కొంతకాలం వాయిదా వేస్తే ఖజానా మీద ఒత్తిడి తగ్గుతుంది. రాబడికి తగినట్లుగా నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాన్ని మార్చుకొంటే లోటు భారం తొలగుతుంది. అంతే తప్ప ఎంత లోటు వుంటే, అంత మేరా జనం అదనంగా పన్నుల రూపంలో చెల్లించాలని ఉత్తర్వులు జారీచేస్తే బ్రతికేదెట్లా? ఏ ఆర్థిక శాస్త్రం ఆ పోకడను సమర్థిస్తుంది?

తెలంగాణ, ఆంధ్ర ఉద్యమాల వల్ల ఇప్పటికే రాష్ట్రంలో ప్రజల జీవితం దుర్భరంగా మారి వుంది. శాంతిభద్రతలు కరువైపోయాయి. బ్రతుకు భయం భయంగా నడుస్తున్నది. ఇప్పటి పన్నులు, ఛార్జీల పెంపకం వల్ల పరిస్థితి మరింత అల్లకల్లోలం కావడం ఖాయం. ప్రతిపక్షాలు ఈ అవకాశంతో మరిన్ని ఆందోళనలు తలపెట్టడం సహజం. దానివల్ల పరిస్థితి ఇంకా వికటిస్తుంది. ప్రజా జీవితంలో శాంతి మృగ్యమైపోతుంది. రోశయ్యగారు తన గల్లాపెట్టె లెక్కలు పక్కనపెట్టి, రాజనీతితో ఆలోచన చేయడం అవసరం. ప్రభుత్వాన్ని నడపడం అంటే రాబడి, ఖర్చులు సరి చూసుకోవడం మాత్రమే కాదు. రాబడి పెంచినంత మాత్రాన ప్రభుత్వం సాఫీగా నడవదు. పాలన సుకరంగా సాగడానికి సమాజంలో శాంతి ప్రధాన అవసరం.

## జనవాణి

### పాపం రోశయ్య!

కొణిజేటి రోశయ్యగారు ముఖ్యమంత్రి పదవి చేపట్టిన క్షణం నుండీ ఎన్నో చికాకులు, మరెన్నో అవమానాలను ఎదుర్కొంటున్నారు. ఊహించని వరదలతో ప్రారంభమైన ఈ వత్తిడి ఆ తర్వాత ప్రత్యేక తెలంగాణ, సమైక్యాంధ్ర ఉద్యమాలు, మంత్రులు, శాసనసభ్యుల రాజీనామాలకు దారి తీసింది. సిఎం బుజ్జగింపులు, వేడికోళ్లను ధిక్కరించి ఎవరికి వారు స్వతంత్రంగా వ్యవహరిస్తూ అసలు రాష్ట్రంలో ప్రభుత్వమే లేనట్లు ప్రవర్తిస్తున్నారు. దీనివల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడి తప్పింది. ఆర్టీసి కార్మికుల సమ్మె అంటున్నారు. దేశంలో అత్యధిక పర్యాయాలు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థికమంత్రిగా రికార్డు సృష్టించిన రోశయ్య ముఖ్యమంత్రిగా పూర్తిగా విఫలమయ్యారు. రాజీనామా చేసిపారేయడంకన్నా ఆయనకు మరో మార్గం లేదు.

సిహెచ్.హనుమంతరావు, నెల్లూరు

### ప్రభుత్వ నియంత్రణ లేని ప్రైవేటు పాఠశాలలు!

ప్రైవేటు పాఠశాలలపై విద్యాశాఖాధికారులకు నియంత్రణ కరువయ్యింది. ప్రభుత్వ ఆదేశాలను వారు పట్టించుకోరు. జిల్లా కామన్ పరీక్ష బోర్డు పరిధిలో వున్నా వారు డిసిఇబి ప్రశ్నాపత్రాలను వాడరు. స్వంతంగా పరీక్షలు పెడతారు. డిఇఓ ఇచ్చిన తేదీల్లో గాక ఇష్టమొచ్చినట్లు పెడతారు. ప్రైవేట్ పాఠశాలలు జిల్లా విద్యాశాఖకు ఆదాయవనరులైనందున వీరు వాటి జోలికి పోరు. పర్యవేక్షణ కొరవడితే విద్యా ప్రమాణాలు నశిస్తాయి. ప్రైవేట్ పాఠశాలలపై ప్రభుత్వ నియంత్రణ కొంత మేరకైనా వుంటే అవి సక్రమంగా పని చేస్తాయి.

ఎం.శ్రీనివాసరావు, నెల్లూరు

### దారి తప్పిన టీవీ కార్యక్రమాలు

వివిధ టీవీ ఛానళ్లలో ప్రసారమవుతున్న కార్యక్రమాలను నియంత్రించే వాళ్లు లేకపోవడంవల్ల దారితప్పిన కార్యక్రమాలు సైతం వీటిలో ప్రసారమవుతున్నాయి. టివి5, ఎన్‌టివి, స్టూడియో ఎన్, మహాటీవీల్లో రాత్రి 11 గంటల నుంచి 11.30 వరకు గలీజు కార్యక్రమాలు ప్రసారమవుతున్నాయి. టెలీ మార్కెటింగ్ కార్యక్రమాల వల్ల కూడా జనం నష్టపోతున్నారు. టీవీల్లో ప్రసారమవుతున్న సీరియళ్లలో ఒకదానిలో వివాహాల శాస్త్రి గారు ఈ దరిద్రపు వృత్తి చేస్తున్నా... దీని బదులు పాప్‌కార్న్ అమ్ముకోవడం బెటర్ అంటాడు. మరొక ఛానల్‌లో ఒకరు అపానవాయువులు విడుస్తుంటే మరొకరు ఈ త్యాగరాయ

కొరవ 14వ పేజీలో

## 70 ఏళ్ల క్రితం ఈవారం

12-1-1940
పేజీలు : 16 వెల: అణా

### సంస్కరణ వివాహము

కాంగ్రెసు వర్కరు మొల్లూరు శేషయ్య, అనసూయదేవి గారలకు సంస్కరణ వివాహం 7తేది దిగ్విజయంగా జరిగింది. మండల కాంగ్రెస్ పెద్దలు ఈ కార్యానికి అన్నివిధాలా ప్రోత్సాహం ఇచ్చినందుకు సంతోషం. వివాహ సమయంలో మండల కాంగ్రెసు ప్రముఖులనేకులు హాజరై వధూవరులను దీవించారు. ఓరుగంటి వెంకటసుబ్బయ్య, గండవరపు హనుమారెడ్డి గారలు వధూవరులను ఆశీర్వదిస్తూ కొద్దిగా మాట్లాడారు. శేషయ్యగారు సంసారపు బురదలో కాలుపెట్టినంత మాత్రాన తన కాంగ్రెసు సేవ కుంటుబడకుండా చూచుకొమ్మని హితవు.

***

ఆర్థిక పరిస్థితిని బట్టి పన్ను విధించాలని రాష్ట్ర ఆదాయ వ్యయ విచారణ కమిటీ సిఫార్సు చేసింది. ఈ పన్ను వలన యేడాదికి రూ 4లక్షలు ఆదాయం రాగలదట.

### డిఇఓగారు

నెల్లూరు జిల్లా విద్యాశాఖాధిగారు పగలంతయు ఇతర పనులంతా చూచుకుంటూ రాత్రి 9 గంటల వరకు గుమాస్తాలను వేధించే పద్ధతి ఎంత త్వరలో మానుకుంటే అంత మంచిదని నా సలహా. వీరి మాటలు మటుకు బహుతీపిగా మనసు నొప్పించకుండా వుంటాయంటారు. రాత్రి 9 గంటలదాకా యేడిపించేటప్పుడు యింత మాత్రమన్నా లేకుంటే అసలు రథం మొదట్లోనే వాటు పడదూ?

### అధికార్ల అసమర్థత

ఈ నెలలో 4తేదీన పురమందిరాన, 5తేది కొత్తహాలులో ప్రదర్శింపబడిన తులాభారం, చింతామణి నాటకాలు ఓవర్ క్రౌడ్ కాబడి, అధికారుల అసమర్థతను బయటపెట్టుచున్నాయి.

## 50 ఏళ్ల క్రితం ఈవారం

8-1-1960
పేజీలు: 12 వెల: 0-3-0

### ముఖ్యమంత్రిగా సంజీవయ్య

శాసనసభ కాంగ్రెస్ పార్టీ నాయకుని నిర్ణయం ఆశ్చర్యకరమైన పరిణామాన్నే పొందింది. అటు కెవి.రంగారెడ్డి, బ్రహ్మానందరెడ్డి గాని; యిటు సత్యనారాయణ రాజుగారు గాని గాకుండా, రాజీగా వూహించని దామోదరం సంజీవయ్య గారు నాయకుడుగా అందరికీ ఆమోదయోగ్యుడైన అభ్యర్థిగా వరింపబడ్డాడు. శుభం!

### క్రొత్త మంత్రులెవరు?

నాయకుడెవరైందీ నిర్ణయమై పోయింది గనుక, యిక మంత్రులెవరైందీ వూహాగానాలు ప్రారంభమైనవి. నాయకుని నిర్ణయం ఎంత క్లిష్టమైనదో, అంతకంటే సంక్లిష్ట సమస్య మంత్రులనెన్నుకోవడం. సంజీవయ్యగారి మంత్రివర్గ సభ్యుల సంఖ్య పదిహేనుగా వుంటుందని వూహ. ప్రస్తుత మంత్రులలో ఎవరెవరుంటారో తెలియదు. కాని కెవి.రంగారెడ్డి, బ్రహ్మానందరెడ్డి గారలు మాత్రం ఖాయమైన సభ్యులు.

కొత్తగా తీసుకోబడేవారి జాబితాలో అల్లూరు సత్యనారాయణరాజు, కల్లూరు చంద్రమౌళి, పిడతల రంగారెడ్డి, పళ్లంరాజు, పివిజి.రాజు, ఏ.సి.సుబ్బారెడ్డి, పి.బసిరెడ్డి, నూకల రామచంద్రారెడ్డి, పి.వి.నరసింహారావు, కొండా లక్ష్మణ్, శ్రీమతి మసుమాబేగం, లక్ష్మీకాంతమ్మ గారల పేర్లు వున్నవి.

### రేబాల దశరథరామిరెడ్డి

మన కేంద్ర బ్యాంకు అధ్యక్షులు, సహకారోద్యమంలో ఆరితేరిన రేబాల దశరథరామిరెడ్డి గారు, రాష్ట్ర సహకార బ్యాంకు అధ్యక్షులుగా ఎన్నుకోబడినందుకు వారిని హృదయ పూర్వకంగా అభినందిస్తున్నాము.

### కనుపూరు కాల్వ ప్రారంభోత్సవం

కనుపూరు కాల్వ ప్రారంభోత్సవం ఫిబ్రవరి 2తేది జరుగుతుంది. ఆరోజు ఉదయం సంగం వద్ద శంకుస్థాపన; సాయంకాలం వెంకటాచలంలో బహిరంగ సభ జరుగుతాయి. శ్రీయుతులు బెజవాడ గోపాలరెడ్డి, నీలం సంజీవరెడ్డి, జై సుఖలాల్ హాథీ, జె.వి.నరసింగరావు గారలు పాల్గొంటారు.

• నెల్లూరు ఎమ్మార్వో ఆఫీసులో

## అర్జీదారుల వెతలు



ప్రజావిజ్ఞప్తులకు మౌనసాక్షి నెల్లూరు ఎమ్మార్వో కార్యాలయం.

నెల్లూరు ఎమ్మార్వో కార్యాలయానికి పలు సమస్యలతో వచ్చే అర్జీదారులు పడుతున్న అవస్థలు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యాన్ని తెలియజేస్తున్నాయి. నగరానికి, రూరల్ మండలానికి సంబంధించి ఏకైక తహశీల్దార్ కార్యాలయం కావడంతో నగర ప్రజలతోపాటు చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి అధిక సం

### పరిధి ఎక్కువ - అధికారులు తక్కువ

ఖ్యలో ప్రజలు తహశీల్దార్ కార్యాలయానికి నిత్యం వస్తుంటారు. సర్టిఫికేట్‌లు, పెన్షన్లు, కార్డులు తదితర సమస్యలపై వచ్చే వారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు సమాధానం చెప్పేవారు లేకపోవడంతో కాళ్లరిగేలా కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. తహశీల్దార్‌తోపాటు ఈ కార్యాలయంలో ఇద్దరు ఆర్ఐలు, ఇద్దరు సర్వేయర్లు, 28 మంది వరకు వీఆర్వోలు పని చేస్తున్నారు. రూరల్, నగర ప్రజల సమస్యలను పరిష్కరించడంలో తగిన రీతిలో పనిచేయకపోవడం, నిత్యం నగరానికి వచ్చే విఐపిల పర్యటన, ప్రోటోకాల్ తదితర పనుల్లో నిమగ్నమై పేద ప్రజల సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం వహిస్తుండడంతో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. కార్యాలయంలో కార్పొరేటర్లు, వారి బంధువుల హవా అంతా ఇంతా కాదు. ఖద్దరు దుస్తుల్లో వచ్చే వారికి నిమిషాల్లో పనిచేసి పెడుతున్న తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది తమను మాత్రం రోజుల తరబడి తిప్పుకొంటున్నారని ప్రజలు వాపోతున్నారు.

• నెల్లూరులో

## పావురాళ్ల పందాలు



పందానికి సిద్ధం.

నెల్లూరు నగరంలో పావురాళ్ల పందాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో ఇవి గుట్టుచప్పుడుకాకుండా జరిగేవి. కొంతకాలం క్రిందట ఈ పందాలలో జరిగిన గొడవల కారణంగా కక్ష పెంచుకొని ఒక వ్యక్తిని హత్యచేసిన విషయం తెలిసిందే. తర్వాత నిలిపివేసి వున్న ఈ పావురాళ్ల పందాలు తిరిగి జోరందుకొన్నాయి.

### ఇదో జూదం

సంతపేట, రంగనాయకులపేట, కపాడిపాళెం, రైల్వేఫీడర్స్‌రోడ్డు తదితర ప్రాంతాలలో కొందరు ఈ పందాలను నిర్వహిస్తున్నారు. అధిక మొత్తంలో డబ్బు చేతులు మారుతోంది. ఈ పందెం నిర్వాహకులకు కొందరు నేతల అండదండలు వుండడంతో పందాలు ఎలాంటి ఆటంకం లేకుండా సాగిపోతున్నాయని సమాచారం. ఇళ్లు, ఒళ్లు గుల్ల చేసుకోవడంతోపాటు నేరప్రవృత్తి పెరుగుతున్నదని, పోలీసులు పందాలను అరికట్టాలని పలువురు ప్రజలు కోరుకొంటున్నారు.

• కాలం మారింది

## సన్నగిల్లిన గ్రీటింగ్ కార్డుల వ్యాపారం



అమ్మకానికి నోచుకోని గ్రీటింగ్ కార్డులు.

నూతన సంవత్సరం, పండుగలు, ఇతరత్రా సందర్భాలలో మిత్రులకు, కుటుంబసభ్యులకు, ముఖ్యులకు శుభాకాంక్షలు తెలిపేందుకు గ్రీటింగ్ కార్డులను వినియోగించడం అనేక సంవత్సరాలుగా వస్తున్న అలవాటు. వయసుతో సంబంధం లేకుండా చిన్నా, పెద్దా అందరూ గ్రీటింగ్ కార్డులను కొని పంచేవారు. కాలక్రమేణా వీటిని కొనేవారి సంఖ్య తగ్గుతూ వస్తుంది. సెల్‌ఫోన్‌ల వాడకం విస్తృతమై ఎస్ఎమ్ఎస్‌ల వాడకం పెరిగిన తర్వాత గ్రీటింగ్ కార్డులకు గిరాకి పడిపోయింది. ఒకనాడు గ్రీటింగ్ కార్డులను అమ్మేందుకు ప్రత్యేకంగా షాపులను ఏర్పాటుచేసి వుండేవారు. గ్రీటింగ్ కార్డులకు ఎంతో క్రేజ్ వుండేది. సెల్‌ఫోన్ల తాకిడికి కార్డులను కొనేమాట సంగతి ప్రక్కనపెడితే వాటిని మరచిపోయే స్థితికి చేరుకొన్నారు ప్రజలు. ప్రతి ఏడాది క్రొత్త సంవత్సరం ఆరంభంలో నగరంలో పలుచోట్ల గ్రీటింగ్ కార్డుల షాపులు ఏర్పాటుచేసి అమ్మకాలు సాగిస్తుండేవారు. అలాంటిది ఈ సంవత్సరం ఎక్కడా ప్రత్యేకంగా షాపులను ఏర్పాటు చేయలేదు. ఒకటి రెండు షాపుల్లో ఇవి వున్నా అడిగేవారు లేరని వ్యాపారులు చెప్తున్నారు. వీటికి బదులుగా పూల బొకేలకు గతంలో ఎన్నడూ లేనంతగా అమ్మకాలు పెరిగాయి. బొకే సెంటర్లు క్రొత్త సంవత్సరం ముందు రోజు నుంచి కిటకిటలాడడం విశేషం.

• వ్యవసాయ

## బీమా పథకం అమలు చేయరేమి?



స్పందించని వ్యవసాయ సంయుక్త సంచాలకుల వారి కార్యాలయం.

జిల్లాలో రైతుల ప్రయోజనార్థం ప్రవేశపెట్టిన జాతీయ వ్యవసాయ బీమా పథకం సక్రమంగా అమలు జరగడం లేదు. ప్రధానంగా ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్లు, చీడలు తదితర పరిణామాల కారణంగా పంట దిగుబడులలో నష్టపోయిన రైతులకు బీమా పథకాన్ని వర్తింపజేయాల్సి వుంటుంది. అయితే జిల్లా వ్యవసాయ శాఖాధికారులు ఈ పథకం అమలు కోసం గట్టిగా కృషి చేయడం లేదన్న విమర్శలు వున్నాయి. గతంలో వ్యవసాయ రుణాలు పొందిన వారికి మాత్రమే దీనిని వర్తింపచేసేవారు. ఈ దఫా రుణాలు పొందని రైతులకు సైతం బీమా పథకాన్ని వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామాలలోని సర్వే నెంబర్ల వారీగా రెవిన్యూ, వ్యవసాయ ప్రణాళికా శాఖాధికారుల సమన్వయంతో నివేదికలు రూపొందించుకోవాల్సి వుంటుంది. ఒక గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని అమలు చేయాలని సంకల్పించారు. జిల్లాలో వరి పంటకు బీమా పథకం వర్తింపజేయాలని నిర్ణయం కూడా తీసుకోవడం జరిగింది. 100 హెక్టార్ల విస్తీర్ణం కంటే తక్కువగా వుంటే సమీప గ్రామాలతో కలిపి ఒక బీమా యూనిట్‌గా ఏర్పాటుచేయాలి. దీని అమలు కోసం ప్రధానంగా వ్యవసాయ శాఖ అవసరమైన సిబ్బందిని కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించుకోవచ్చని ప్రభుత్వ ఉత్తర్వులు వున్నాయి. జిల్లాలో తొలుత 176 గ్రామాలను యూనిట్లుగా ఏర్పాటుచేయాలన్న లక్ష్యం ఇంతవరకు నెరవేరలేదు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా వరి పంటకు నష్టం వాటిల్లి రైతులు తీవ్రంగా నష్టపోతున్నా అధికారులు మాత్రం పట్టీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. రైతులకు లబ్ది చేకూరాలన్న సంకల్పంతో ప్రవేశపెట్టిన జాతీయ వ్యవసాయ బీమా పథకం అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీరుగారిపోయే ప్రమాదం ఏర్పడింది.

## కదలని కార్లు, టెంపోలు

### తెలంగాణా ఉద్యమ ప్రభావం



ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిందన్నట్లు తెలంగాణ రాష్ట్ర వేర్పాటువాదం రవాణా సౌకర్యాలపైన తీవ్ర ప్రభావం చూపెడుతోంది. జిల్లా నుంచి కార్లు, టెంపోలు, లారీలు రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రదేశాలకు వెళ్తూ, వస్తూ వుండేవి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుపై రాష్ట్రం రెండు ముక్కలుగా చీలిపోయి సమైక్యాంధ్ర నినాదం తెరపైకి వచ్చిన నాటి నుంచి తెలంగాణ, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు నిలచిపోతున్నాయి. ముఖ్యంగా టాక్సీల నిర్వాహకులకు, డ్రైవర్లకు గట్టి దెబ్బతగిలింది. ఆంధ్రలో రిజిస్ట్రేషన్ అయి వున్న వాహనాలపై బయటి ప్రాంతాల్లో దాడులు జరుగుతుండడం, వాహనాలను ధ్వంసం చేస్తుండడంతో బాడుగులకు వాహనాలను త్రిప్పడం తగ్గిపోయిందని, దీనిపై ఆధారపడి జీవనం సాగించే తమకు కష్టాలు తప్పడం లేదని పలువురు డ్రైవర్లు వాపోతున్నారు.

## కొళాయిలకు మూతలు బిగించరా?

దున్నపోతుపై వర్షం కురిసినట్లుగా వుంది మునిసిపల్ కార్పొరేషన్ సిబ్బంది వ్యవహారశైలి. నగరవాసులు మంచినీటి కోసం ఒకవైపు ఎదురుచూస్తుంటే మరోవైపు నీటివృథా జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పలు ప్రాంతాలలో మంచినీటి కొళాయిలకు మూతలు లేకపోవడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో నీరు ధారాపాతంగా వృథాగా పోతున్నది. చాలాకాలంగా కొళాయిలకు మూతలు లేకపోయినా ఆయా ప్రాంతాలలోని కార్పొరేటర్లు, మునిసిపల్ సిబ్బంది పట్టించుకొన్న దాఖలాల్లేవు. మినీబైపాస్ రోడ్డు, బాలాజీనగర్, ఎసినగర్, జ్యోతినగర్, వేదాయపాళెం, నాగేంద్రనగర్ తదితర ప్రాంతాలలో కొన్ని సంవత్సరాలుగా కొళాయిలకు మూతలు లేవు. మరికొన్ని చోట్ల మురికినీటి గుంటల్లో మంచినీటి కొళాయిలు ఏర్పాటుచేసి వుండడంతో ప్రజలు నీటిని పట్టుకొనేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అసలే అంటువ్యాధులు, విషజ్వరాలు ప్రబలుతున్న తరుణంలో మంచినీరు కలుషితం కాకుండా చూడడంతోపాటు కొళాయిల్లోని నీరు వృథా కాకుండా కార్పొరేషన్ సిబ్బంది చర్యలు చేపట్టాల్సి వుంది.

# రాజీవ్ యువశక్తికి నీరసం!

**చదువుకొని ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వంతంగా ఉపాధి పథకాన్ని స్థాపించుకోవాలన్న లక్ష్యంతో వున్నవారికి యువజన సర్వీసుల శాఖ ద్వారా ఆర్థిక చేయూత ఇవ్వాలన్న ప్రభుత్వ లక్ష్యం అధికారుల నిర్లక్ష్యం కారణంగా నెరవేరకుండా పోయింది.**



నిరుద్యోగులకు ఉపాధి చూపలేని జిల్లా పరిశ్రమల కేంద్రం.

జిల్లాలో చదువుకుని నిరుద్యోగులుగా వున్నవారికి, చదువులేని వారికి స్వయం ఉపాధి, శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో యువజన సర్వీసులు, శిక్షణ, ఉపాధి ప్రోత్సాహక సంస్థను ఏర్పాటుచేయడం జరిగింది. చదువుకుని ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వంతంగా ఉపాధి పథకాన్ని స్థాపించుకోవాలన్న లక్ష్యంతో వున్నవారికి ఈ శాఖ ద్వారా ఆర్థిక చేయూత ఇవ్వాలన్న ప్రభుత్వ లక్ష్యం అధికారుల నిర్లక్ష్యం కారణంగా నెరవేరకుండా పోయే ప్రమాదం ఏర్పడింది.

## నిరుద్యోగుల పట్ల కనికరం లేదు

స్వయం ఉపాధి పథకాల ఏర్పాటుకు నిధుల కొరత లేదని ప్రభుత్వం పదే పదే ప్రకటిస్తున్నా ఈ శాఖ ఉన్నతాధికారులు మాత్రం నిరుద్యోగుల పట్ల కనికరం చూపడం లేదు. స్వయం ఉపాధి పథకాల మంజూరుకు లబ్దిదారులను ఎంపిక చేయడంతో పాటు వేతన ఉపాధికి వృత్తి నైపుణ్యత శిక్షణా కార్యక్రమాలను కూడా అమలు చేయాల్సి వుంటుంది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నూతనంగా యువజన సర్వీసుల శాఖను ఏర్పాటు చేయడం జరిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రాజీవ్ యువశక్తి విభాగాన్ని ఏర్పాటు చేసింది. దీని ద్వారానే స్వయం ఉపాధి, శిక్షణా కార్యక్రమాలు అమలవుతున్నాయి.

### ఉత్తర్వులిస్తేనే మంజూరు!



యువజన సర్వీసుల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న రాజీవ్ యువశక్తి పథకం 2009-2010 సంవత్సరానికి సంబంధించి యూనిట్ల మంజూరు నిలిపివేయమని రాష్ట్ర కమిషనర్ నుంచి ఉత్తర్వులున్నాయి. యూనిట్ల మంజూరుకు లబ్దిదారుల ఎంపిక కూడా పూర్తి చేయడం జరిగింది. యూనిట్ల గ్రౌండింగ్‌కు రాష్ట్ర కమిషనర్ నుంచి ఉత్తర్వులు వస్తేనే ఈ ప్రక్రియ ప్రారంభమౌతుంది.

*వై.సుధాకర్, సిఇఓ, జిల్లా పరిశ్రమల కేంద్రం.*

రాజీవ్ యువశక్తి పథకం అధికారులు ఉపాధి పథకాలు మంజూరు చేస్తామని ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఆచరణలో మాత్రం పూర్తిగా వైఫల్యం చెందుతున్నారు. మంజూరు చేసిన యూనిట్ విలువలో 20 శాతం సబ్సిడీ, పది శాతం లబ్దిదారుడు, 70 శాతం సంబంధిత బ్యాంకులు సమకూర్చే విధంగా దీనిని రూపొందించడం జరిగింది. అయితే బ్యాంకులు మాత్రం రుణాలు మంజూరు చేసేందుకు ముందుకు రావడం లేదు. లబ్దిదారుల ఎంపిక సమయంలో బ్యాంకు అధికారులను సమావేశపరిస్తే పారదర్శకంగా వుంటుంది. ఇక్కడ అధికారులు తమకు ఇష్టమైన రీతిలో లబ్దిదారులను ఎంపికచేసి ఆ తర్వాత రుణం మంజూరు కోసం జాబితాను బ్యాంకులకు పంపుతుంటారు. యూనిట్లు పనిచేయవనో, లేకుంటే సెక్యూరిటీ కావాలనో సాకు చూపి బ్యాంకు అధికారులు రుణం మంజూరు చేయకుండా తప్పించుకుంటున్నారు. దీంతో తిరిగి లబ్దిదారులు రాజీవ్ యువశక్తి కార్యాలయాన్ని ఆశ్రయించక తప్పడం లేదు. ఈ కార్యాలయంలో పనిచేస్తున్న కొంతమంది సిబ్బంది లబ్దిదారుల నుంచి నగదు వసూలు చేస్తున్నారు. ఎంపికచేసిన లబ్దిదారుల జాబితాను బ్యాంకులకు పంపి త్వరగా రుణం మంజూరు చేయిస్తామని నమ్మబలికి వెయ్యి నుంచి రెండువేల రూపాయల వరకు గుట్టుచప్పుడు కాకుండా తీసుకుంటున్నారు.

గత సంవత్సరం కోవూరు మండలం పాటూరుకు చెందిన ఓ మహిళ స్వయం ఉపాధి పథకానికి ఎంపికయ్యింది. దరఖాస్తును కోవూరు పినాకిని బ్యాంకుకు పంపి రుణం మంజూరు చేయిస్తామని కార్యాలయ గుమస్తా ఒకరు వెయ్యి రూపాయలు తీసుకున్నాడు. అయితే లబ్దిదారురాలికి మాత్రం బ్యాంకు అధికారులు రుణం మంజూరు చేసేందుకు నిరాకరించారు. ఈ విషయాన్ని కార్యాలయ గుమస్తా దృష్టికి సదరు మహిళ తీసుకెళ్లినప్పటికీ ఏవేవో డాక్యుమెంట్లు కావాలని చెప్పి తప్పించుకున్నాడు. దీంతో బాధితురాలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక వెనుదిరగాల్సి వచ్చింది. ఈ సంఘటన కేవలం ఉదాహరణ మాత్రమే. ఇటువంటివి అనేకం వున్నాయి.

## అందుబాటులో లేని అధికారి

లబ్దిదారులు తమ గోడును వినిపించేందుకు కార్యాలయానికి వస్తే ఉన్నతాధికారి అందుబాటులో వుండరు. ఎక్కడికి వెళ్లారు? ఎప్పుడు వస్తారు? అన్న సమాచారాన్ని కూడా చెప్పే దిక్కు లేకుండా పోయారు. బ్యాంకులు రుణం మంజూరు చేస్తాయో లేదో తెలియదుకాని ముందుగా మాత్రం కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుకు నగదు సమర్పించుకోవాల్సి వుంటుంది. ఉన్నతాధికారికి కార్యాలయ సిబ్బంది పని విధానంపై పర్యవేక్షణ లేకపోవడం వల్ల వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ లబ్దిదారులను జలగల్లా పీడిస్తున్నారు. ఎంతో కొంత ముట్టజెప్పకపోతే వారికి కాల్ లెటర్ పంపకుండా చేస్తుంటారు.

2009-10 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నాలుగు కోట్ల 28 లక్షలతో 624 మంది లబ్దిదారులను ఎంపిక చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. గత జూన్ నెల నుంచి ఆగష్టు మధ్యలో దరఖాస్తులు స్వీకరించి ఇంటర్వ్యూలు కూడా నిర్వహించి లబ్దిదారులను ఎంపిక చేశారు. ఎంపికైన లబ్దిదారులకు పథకం మంజూరు చేయరాదని యువజన సర్వీసులశాఖ కమీషనర్ నుంచి జిల్లాకు ఆదేశాలు అందాయి. దీంతో ఈ పథకం అమలుకు నోచుకోలేక పోయింది. జిల్లాకు చెందిన నిరుద్యోగులకు స్వయం ఉపాధి పథకాలు మంజూరు చేస్తే ఆ శాఖ ఉన్నతాధికారులకు వచ్చిన ఇబ్బంది ఏమిటో స్పష్టంగా చెప్పడం లేదు. తదుపరి ఆదేశాలు అందే వరకు యూనిట్లు మంజూరు చేయరాదని మాత్రం పేర్కొన్నారు. మరో మూడు నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఈ మూడు నెలల లోపల కేటాయించిన లక్ష్యాన్ని సాధించడం కష్టతరం.

## శిక్షణ పేరిట భక్షణ!

చదువుకున్న నిరుద్యోగులకు వివిధ రంగాలలో శిక్షణ ఇచ్చి వారికి పలు ప్రైవేట్ సంస్థలలో ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో వృత్తి నైపుణ్యత శిక్షణా కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ అంశాన్ని బట్టి నెల రోజుల నుంచి మూడు నెలలపాటు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాల్సి వుంటుంది.

శిక్షణ కార్యక్రమానికి అయ్యే ఖర్చులో 500 రూపాయలు అభ్యర్థి భరిస్తే మిగిలిన మొత్తాన్ని యువజన సర్వీసుల శాఖ చెల్లిస్తుంది. శిక్షణ పూర్తి చేసిన వెంటనే 70 శాతం మందికి ఉపాధి చూపించే బాధ్యత శిక్షణ సంస్థలదే. ఇందుకు ముందుగానే ఆయా సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంటారు. శిక్షణా కార్యక్రమాలకు ప్రతి సంవత్సరం లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నా ఆశించిన ఫలితాలు రావడం లేదు. 2008-09 సంవత్సరంలో దాదాపు 75 లక్షలతో మూడువేల మందికి శిక్షణ ఇవ్వగా వీరిలో 500 మందికి కూడా ఉపాధి చూపించలేక పోయారు. ప్రైవేటు సంస్థల ప్రతినిధులు ఆర్థిక సంవత్సరంలో 20 లక్షల రూపాయల వ్యయంతో 800 మందికి వివిధ రంగాలలో శిక్షణ ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధంగా వున్నాయి.

వృత్తి నైపుణ్యత పెంపొందించుకొనేందుకు కాల్‌సెంటర్ ఎగ్జిక్యూటివ్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, ఆఫీస్ ప్రొడక్టివిటీ, డెస్క్‌టాప్ అప్లికేషన్స్, ఫ్యాషన్ డిజైనింగ్, డిసిఎ, సెక్యూరిటీగార్డు, హార్డ్‌వేర్, నెట్‌వర్కింగ్, పిసి మెయింటెనెన్స్, డేటాఎంట్రీ ఆపరేటర్స్, ట్యాలీ, బ్యూటీషియన్, లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ తదితర కోర్సులలో శిక్షణ ఇస్తారు. శిక్షణ ఇచ్చే సంస్థలన్నీ కూడా హైదరాబాద్‌కు చెందినవే కావడం ఇక్కడ విశేషం. దూర ప్రాంతాలలో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం వల్ల కొంతమంది మధ్యలో తిరిగి వచ్చేస్తున్నారు. ప్రైవేటు ఏజెన్సీ నిర్వాహకులు ఇచ్చే కమీషన్లకు ఆశపడి శిక్షణ కార్యక్రమాలను అప్పగిస్తూ, నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారు అధికారులు.

మన జిల్లాలో శిక్షణ ఇచ్చే సంస్థలు వున్నప్పటికి వీటిని కాదని హైదరాబాద్‌కు చెందిన సంస్థలకు ఎందుకు అప్పగిస్తున్నారో ఆ శాఖ ఉన్నతాధికారులే జవాబు చెప్పాల్సి వుంది.

**జమీన్‌రైతు**
పొగతోట, నెల్లూరు - 524 001
ఫోన్: 0861 - 2327354
సెల్: 98489 66190
జీవిత చందా రూ.1000లు
సంవత్సర చందా
స్వదేశంలో రూ.200లు
విదేశాలకు రూ.1000లు

# చెత్త పేరుకొన్న గూడూరు

గూడూరు పట్టణంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా వుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎక్కడ చూసినా చెత్తాచెదారాలు గుట్టలుగుట్టలుగా పడి వుండడంతో రోడ్లపైన నడవాలంటేనే ఇబ్బంది పడాల్సివస్తోంది. ఏ ప్రాంతాన్ని పరిశీలించినా చెత్త దర్శనమిస్తున్నది. ప్రధానంగా గూడూరు ప్రభుత్వ ఆస్పత్రి, సిఆర్‌రెడ్డి ఆస్పత్రి వద్ద చెత్త పేరుకపోయి వుంది. రోజుల తరబడి చెత్తను తొలగించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతుండడంతో ఆ మార్గాన నడవాలంటేనే హడలిపోతున్నారు ప్రజలు. మార్కెట్ సెంటర్‌లోను చెత్తా చెదారం నిండిపోయి వుంది. దీనికి తోడు పందులు స్వైరవిహారం చేస్తూ, చెత్తలో పొర్లుతుండడంతో ప్రజలు భరించలేకపోతున్నారు. మునిసిపల్ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారి అంటురోగాలు ప్రబలి పలువురు ఆస్పత్రుల పాలౌతు

### వ్యాధులతో జనం సతమతం

న్నారు. డెంగ్యూ, చికున్‌గున్యా వ్యాధులతో అధికసంఖ్యలో ప్రజలు వైద్యచికిత్సలు పొందాల్సి వస్తున్నది. ప్రజల బాగోగులు పట్టించుకోవాల్సిన ప్రజాప్రతినిధులు, మునిసిపల్ అధికారులకు మాత్రం ఇవేమీ పట్టడం లేదు.



నెల్లూరు తిక్కన కళాపీఠం నేతృత్వంలో జరిగిన కవి సమ్మేళనంలో మొల్ల పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు గాసుగపెంట హనుమంతరావును సత్కరిస్తున్న ఆచార్య ఆదిత్య, ఆర్వీ శేషయ్యనాయుడు, మురళీమోహన్‌రాజు తదితరులు.

## నాగేటి గడ్డ అక్రమ రవాణా

### చెన్నైలో మంచి గిరాకీనే కారణం

జిల్లా నుంచి నాగేటిగడ్డ అక్రమ రవాణా గుట్టుచప్పుడు కాకుండా సాగిపోతోంది. ఎన్నో ఔషధ నిలువలున్న ఈ గడ్డకు డిమాండ్ వుండడంతో తమిళనాడుకు తరలించడం అధికమైంది. వెలిగొండ అడవులు విస్తరించి వున్న ఉదయగిరి, ఆత్మకూరు, రాపూరు, వెంకటగిరి ప్రాంతాలలో నాగేటిగడ్డ విరివిగా లభ్యమవుతున్నది. తమిళనాడు నుంచి కొందరు వచ్చి స్థానికుల సహకారంతో వీటిని తరలించుకపోతున్నట్లు సమాచారం. దీనిని అరికట్టడంలో తనిఖీ సిబ్బంది విఫలం అవుతున్నారు. ఈ గడ్డ గురించి దీనిని తరలించడం నేరం అన్న సంగతి ఒక్క అటవీశాఖ అధికారులకు తప్ప పోలీసులకు, తనిఖీ కేంద్రాల వద్ద వుండే వారికి తెలియకపోవడంతో సాధారణ గడ్డలుగా భావించి వదలివేస్తుండడంతో ఢిల్లీ, ముంబాయి, ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారట. ఇకనైనా ఈ నాగేటిగడ్డ అక్రమ రవాణాను అరికట్టాల్సి వుంది.

## ముత్తుకూరులో దొంగల బెడద

పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ముత్తుకూరు మండలంలో ఇటీవల కాలంలో దొంగల బెడద ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కృష్ణపట్నంపోర్టు, రిలయన్స్, జెన్‌కో ప్రాజెక్టు పనులు జరిగే ప్రాంతాలలో, పలు గ్రామాల్లో ఇటీవలకాలంలో దొంగతనాలు జోరందుకొన్నాయి. దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌లు, అందులోని విడిభాగాలు, రాగి వైర్లను సైతం దొంగిలించుకొని వెళ్తున్నారు. కృష్ణపట్నంలోని సెల్‌ఫోన్ దుకాణంలో ఇటీవల చోరీ

### పారిశ్రామిక ప్రాంతంలో తగవివి

జరిగింది. చలివేంద్రం, ఉప్పుకొటార్లకు వెళ్లే దారిలో ట్రాన్స్‌ఫార్మర్‌లకు ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేసి వున్నారు. దీనిని అవకాశంగా చేసుకొని దొంగలు విజృంభిస్తుండడంతో చిన్న చిన్న వస్తువుల నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌ల వరకు చోరీకి గురౌతున్నాయి. మండలంలో దొంగతనాలు ఎక్కువైనా వాటిని అరికట్టాల్సిన పోలీసులు నిద్రావస్థలో వుండడం ప్రజలకు శాపంగా మారింది.



బంద్‌ను పురస్కరించుకొని నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్ వద్ద మాట్లాడుతున్న తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి. ప్రక్కన నగర ఎమ్మెల్యే శ్రీధరకృష్ణారెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు.

## నిరుపయోగంగా మంచినీటి ట్యాంకు

గ్రామ ప్రజల దాహార్తిని తీర్చేందుకు లక్షల రూపాయల నిధులు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన మంచినీటి పథకం నిరుపయోగంగా మారిన వైనం కొడవలూరు మండలం మిక్కిలింపేట పంచాయితీలో చోటుచేసుకొంది. పంచాయితీ పరిధిలోని సంగాయపాళెం ప్రజల మంచినీటి అవసరాలకు రెండు లక్షల రూపాయలు ఖర్చు చేసి బోరు, పైపులైను ఏర్పాటు చేశారు. ఐదువేల లీటర్ల సామర్థ్యం వున్న రెండు సింటెక్స్ వాటర్ ట్యాంకులను బిగించారు. అంత వరకు బాగానే వున్నా చివరకొచ్చేసరికి గొళ్లెం వేసితిని తాళం మరచితిని అన్న చందంగా వాటర్ ట్యాంకులకు కనెక్షన్ ఇవ్వడం మరిచారు. దీంతో లక్షలు పెట్టి మంచినీటి కోసం ఏర్పాట్లు చేసినా నీరు అందక చేతి పంపులపైనే ఆధారపడాల్సి వస్తోంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ట్యాంకు నిర్మించి ఆరునెలలు గడుస్తున్నా నీళ్లురావడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

## ఎలుకల నిర్మూలన చర్యలు

వరి పంటను నాశనం చేసే ఎలుకల నివారణకు రైతులు ప్రత్యేకశ్రద్ధ చూపాలని విడవలూరు మండల వ్యవసాయాధికారి కుప్పయ్య సూచించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతు శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. ఆరుగాలం శ్రమించి రైతులు పండించే పంట చేతికందే దశలో ఎలుకలు నాశనం చేస్తున్నాయని తెలిపారు. దీని వలన దిగుబడి తగ్గి రైతులకు నష్టం వస్తున్నదన్నారు.

### సులభమే

ఎలుకలను నివారించినట్లయితే కష్టబడి పండించిన పంటకు దిగుబడి అధికంగా వుంటుందన్న సంగతిని రైతులు గుర్తించుకోవాలన్నారు. ఎలుకలను నాశనం చేసేందుకు బ్రోమోడయోలిన్ అనే మందును ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ మందును కిలో బియ్యం, 20 గ్రాముల నూనెలో కలిపి పొలం చుట్టూ గెనాల వద్ద వుండే బొరియల్లో వుంచాలన్నారు. ఈ సందర్భంగా మందు కలిపే విధానాన్ని రైతులకు వివరించి, వారి సందేహాలను నివృత్తి చేశారు.

## ట్రాన్స్‌కో X పంచాయితీ!

### నాయుడుపేటలో ముదిరిన వివాదం

దెబ్బకు దెబ్బ అనే మాట పలు సందర్భాలలో నిరూపితం అవుతుంటుంది. ఎదుటివారు చేసిన దానికి తిరిగి అలాంటి దెబ్బ తీయడమన్నది నాయుడుపేటలో చోటు చేసుకొంది. ఈ పంచాయితీ పరిధిలో వీధిలైట్లు, నీటిసరఫరా విభాగాలకు ట్రాన్స్‌కో అధికారులు ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. తామెవరం ఊళ్లోలేని సమయంలో ట్రాన్స్‌కో సిబ్బంది వ్యవహరించిన తీరును స్థానిక సర్పంచ్, పంచాయితీ సిబ్బంది ఆగ్రహించారు. ట్రాన్స్‌కోకు బకాయిపడిన మాట వాస్తవమని అయినా ఏకపక్షంగా వ్యవహరించడం తగదని ధ్వజమెత్తారు. అంతటితో ఊరుకోకుండా తమకు జరిగిన అవమానానికి ప్రతీకారంగా పంచాయితీ సిబ్బంది నాయుడుపేటలోని ట్రాన్స్‌కో అధికారుల ఇళ్లకు నీటిసరఫరా నిలిపి వేశారు. వీరిరువురి చర్యలకు సామాన్యులు ఇబ్బంది పడాల్సి వచ్చింది.

## కేసులకు జడిసిన కావలి నేతలు

సమైక్యాంధ్ర కోసం పలు జిల్లాల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు, ఆందోళనలు చేస్తుంటే కావలి నేతలు మాత్రం వీటిలో పాల్గొనేందుకు భయపడుతున్నారు. జనవరి 5తేదిన జరిగిన రైల్‌రోకోకు అటు నాయకులు, ఇటు కార్యకర్తలు డుమ్మాకొట్టారు. దీంతో కావలిలో రైల్‌రోకో ఊసే లేకుండా పోయింది. పోలీసుల హెచ్చరికలతో నేతలు అటువైపు రాలేదని తెలుస్తున్నది. రైళ్లను ఆపితే జరిమానాతో కూడిన జైలుశిక్ష పడుతుందని పోలీసులు హెచ్చరించడంతో రైలురోకో కార్యక్రమానికి వెనుకడుగు వేసినట్లు సమాచారం.

## అరాచకాల బస్టాండ్ సెంటర్



నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ సెంటర్ అంటే ఎంతో పేరుగాంచింది. గడిచిన 60ఏళ్లుగా ఈ బస్టాండ్ సెంటర్ నుంచే అల్లూరు, కావలి, వింజమూరు, బుచ్చి, ఉదయగిరి, ఆత్మకూరు ప్రాంతాలకు బస్సులు వెళ్తున్నాయి. ఎప్పుడూ సందడిగా వుండే ఈ సెంటర్ ఇటీవల అరాచకాలకు కేంద్ర బిందువుగా మారింది. ఆరేడు నెలల్రితం ఈ బస్టాండ్ బయట నిలబడి వుండిన ఓ వివాహితను దుండగులు తీసుకెళ్లి సామూహిక అత్యాచారం చేసిన ఘటనను మరువక ముందే 2009 డిసెంబర్ 31తేది రాత్రి ఆత్మకూరు బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురు చూస్తుండిన మరో మహిళకు కోవూరు యువకులు మాయమాటలు చెప్పి పట్టుకెళ్లారు. పడుగుపాడు శ్రీనివాసనగర్ వద్ద సామూహిక అత్యాచారం చేసి వదలిపెట్టారు. పరువుకు జడిసిన ఈ మహిళ ఈ విషయమై పోలీసులకు సైతం ఫిర్యాదు చేయలేదు. పోలీసులు ఈ విషయమై తమకు తాము స్పందించాల్సిందిపోయి గమ్మునుండిపోవడం విమర్శలకు తావిచ్చింది.

## తక్కువ తిన్నారు



జనవరి 1 తేది అంటే వున్నవాళ్లు లేనివాళ్లని తేడా లేకుండా అందరూ హుషారుగా చేసుకొంటారు. మాంసాహారులు చికెన్, మటన్, చేపలు, రొయ్యలు దండిగా కొనుగోలు చేసి రకరకాల ఐటమ్స్ చేస్తారు. కాని ఈసారి ఆర్థికమాంద్యం, వేర్పాటు ఉద్యమాల ప్రభావమేమో మార్కెట్‌లో చికెన్, మటన్, చేపలు, రొయ్యల దుకాణాలు వెలవెలబోతూ కనిపించాయి. మటన్ కిలో 280 నుంచి 300 రూపాయలు, స్కిన్‌లెస్ చికెన్ కిలో 110 నుంచి 130 రూపాయలు, చేపలు కిలో 60 నుండి 80రూపాయలకు అమ్ముకోవాలని ప్రణాళికలు రచించిన వ్యాపారులకు ఆశాభంగం తప్పలేదు.

## కాకాపై పడ్డ 'వివేకా'



రాష్ట్రంలో సమైక్యాంధ్ర గళం వినిపిస్తున్న ఎమ్మెల్యేలలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి ముందు వరుసలో వున్నారు. ఆయన తెలంగాణ నేతలతో నువ్వా - నేనా అన్నట్లు వివిధ ఛానళ్ల చర్చలలో పాల్గొంటున్నారు. ఈవారంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.వెంకటస్వామి ప్రత్యేక తెలంగాణను చూడడమే తన చివరి కోరికని చెప్పడంతోపాటు దివంగత వైఎస్‌ను ఈ వ్యవహారంలో తప్పుపట్టడాన్ని వివేకా జీర్ణించుకోలేక పోయారు. ఆయనపై విమర్శలు సంధించారు. గుడిసెల వెంకటస్వామి గుడిసెల స్థాయి నుంచి వెయ్యికోట్ల రూపాయలు సంపాదించిన స్థాయికి ఎలా ఎదిగారో అందరికీ తెలుసు. ఆయన కదలలేని మెదలలేని స్థితిలో కూడా పార్లమెంట్‌సభ్యునిగా పనిచేశారు. ఆయన కొడుకులను రాష్ట్రమంత్రులను, ఎమ్మెల్యేలను చేసుకొన్నాడు. ఇప్పుడేమో తినింది అరగక ఏదో మాట్లాడుతున్నాడని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నెల్లూరు చెరువు వద్ద రొట్టెలపండుగను పురస్కరించుకొని సమైక్యాంధ్ర రొట్టెను పట్టిన వివేకాను విలేకరులు కదిలించగా కాకాపై కస్సుబుస్సు లాడారాయన.

## నిరుద్యోగుల ఉద్యమం



ప్రత్యేక తెలంగాణ ఉద్యమం పదవులు కోల్పోయిన రాజకీయ నిరుద్యోగులు చేస్తున్న ఉద్యమంగా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. 1969 నుంచి ఇప్పటివరకు ఏదోకారణంతో పదవులు కోల్పోయిన నేతలు మర్రి చెన్నారెడ్డి, పటోళ్ల ఇంద్రారెడ్డి, కె.చంద్రశేఖర్‌రావులు ఈ వేర్పాటువాదాన్ని రాజేశారు. కెసిఆర్ సెలైన్ దీక్షకు కేంద్రప్రభుత్వం భయపడిందంటే దాని దీక్షాదక్షతలు శంకించవలసి వస్తుంది. తెలంగాణ విద్యార్థులు సీమాంధ్రులను హైదరాబాద్‌కు రానివ్వమని నోరుజారి వామనులయ్యారని, దేశంలో వారి కెక్కడా ఉద్యోగాలు రావని చంద్రమోహన్‌రెడ్డి శాపనార్థాలు పెట్టారు.

## సంబరాలకు దూరం



జిల్లాలో అధికారపార్టీ ఎమ్మెల్యేలు ఈసారి జనవరి 1తేది సంబరాలకు దూరమయ్యారు. పురపాలక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఆయన అన్న రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి హైదరాబాద్‌లోనే నిలిచిపోయారు. స్వంత నియోజకవర్గాలకు వచ్చి సంబరాల్లో పాలుపంచుకోను వారికి ముఖం చెల్లలేదు. దీనికి విరుద్ధంగా తెలుగుదేశం ఎమ్మెల్యేలు బీద మస్తాన్‌రావు, బల్లి దుర్గాప్రసాద్, పరసారత్నం, కురుగొండ్ల రామకృష్ణ జనవరి 1తేది సంబరాలను నియోజకవర్గ ప్రజలతో కలసి చేసుకొన్నారు. జిల్లాలో ఏకైక ప్రజారాజ్యం ఎమ్మెల్యే శ్రీధర్‌కృష్ణారెడ్డి మాత్రం శ్రీశైలంలో బస చేయడం కొసమెరుపుగా చెప్పుకోవచ్చు




## ద్వితీయ వర్ధంతి



మా ఇంటి దీపం,

ప్రేమానురాగాలు పంచిన అమృతమూర్తి

**శ్రీమతి మారంరెడ్డి ఇందిరమ్మగారు**

స్వర్గస్తులై 13-01-2010 నాటికి రెండు సంవత్సరాలు నిండుతాయి.

**వారి ద్వితీయ వర్ధంతి 13-01-2010 తేది బుధవారం**

నెల్లూరు జిల్లా, మనుబోలు మండలం,

మడమనూరు గ్రామంలోని మా స్వగృహము నందు జరుగును.

వారిని సంస్మరించుకొంటూ...

**శ్రీమతి మారంరెడ్డి ఇందిరమ్మ గారు**

స్వర్గీయ మారంరెడ్డి రామిరెడ్డి గారి సతీమణి- మడమనూరు

కుమారులు

**మారంరెడ్డి మధుమోహన్‌రెడ్డి కుటుంబం**

చైర్మన్ & మేనేజింగ్ డైరక్టర్

మిడ్‌ఫీల్డ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్

జీడిమెట్ల, హైదరాబాదు.

**మారంరెడ్డి ప్రదీప్‌కుమార్‌రెడ్డి కుటుంబం**

ఉపాధ్యక్షులు, మనుబోలు మండల పరిషత్

మరిది

**మారంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కుటుంబం**

అన్న

**అన్నంరెడ్డి సుబ్బారెడ్డి కుటుంబం** - కావలి

తమ్ముళ్లు

**అన్నంరెడ్డి వరదారెడ్డి కుటుంబం** - మడమనూరు

**అన్నంరెడ్డి భాస్కరరెడ్డి కుటుంబం** - మడమనూరు

మరిది

**దార్ల సుధాకరరెడ్డి కుటుంబం** - చెన్నై

# శిథిల గ్రామాన్ని తలపిస్తున్న అల్లూరు పంచాయితీ!

పేరుగొప్ప, ఊరుదిబ్బ అనే సామెతను గుర్తుకు తెస్తుంది అల్లూరు గ్రామ పంచాయితీ. విస్తీర్ణంలో రాష్ట్రంలోనే ఇంత పెద్ద పంచాయితీ ఎక్కడాలేదు. మొన్నటి వరకు అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంగా వున్న అల్లూరు అభివృద్ధి విషయంలో మాత్రం వెనుకబడిపోయింది. గతంలో అల్లూరుకు చెందిన కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఎమ్మెల్యేగా రెండు దఫాలు గెలుపొందడం జరిగింది. అప్పటి వరకు ఇతర మండలాలకు చెందిన వారు ఈ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన సందర్భాలున్నాయి. ఏ పార్టీ వాళ్లు ఎమ్మెల్యేగా గెలిచినా వారంతా అల్లూరును చాలా చిన్న చూపు చూశారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా అల్లూరు నియోజకవర్గం రద్దు కాబడింది. ప్రస్తుతం కావలి నియోజకవర్గంలో అల్లూరును విలీనం చేశారు. అల్లూరు గ్రామ పంచాయితీలో 25వేల జనాభా, 20వేల మంది ఓటర్లు వున్నారు. రాయపేట, చింతగుంట, ఉడ్‌హౌస్‌పేట, చాకిరేవుగుంట, పల్లిపాడు, ఎర్రపుగుంట, ఉద్దెపుగుంట, బోడిసత్రం, సింగారెడ్డి దిన్నె తదితర మజరా గ్రామాలన్నీ అల్లూరు గ్రామ పంచాయితీ పరిధిలోనే వున్నాయి.

దాదాపు ఎనిమిది కిలోమీటర్ల దూరం వరకు పంచాయితీ విస్తరించి వుంది. విస్తీర్ణం పెద్దదిగా వున్నా మజరా గ్రామాలలో మాత్రం పంచాయితీ చేపట్టే కార్యక్రమాలు ఏమి కనిపించవు. పంచాయితీకి వివిధ పన్నుల రూపంలో 14 లక్షలకు పైగా వసూలవుతుంటాయి. ఇవే కాకుండా 12వ ఆర్థిక సంఘం, ఎస్.ఎఫ్.సి నిధులు కలిపి మరో కోటి రూపాయలకు పైగా ప్రభుత్వం నుంచి విడుదలవుతాయి. సెస్సు రూపంలో మరో 2లక్షలు అందుతాయి. ఇన్ని నిధులు పంచాయితీకి అందుతున్నా గ్రామాలలో మాత్రం అభివృద్ధి పనులు చేపట్టడం లేదు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, త్రాగునీటి సమస్య, అంతర్గత రోడ్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల అల్లూరు మెయిన్‌రోడ్డు విస్తరణలో భాగంగా ఆర్‌అండ్‌బి అధికారులు ఆక్రమణలు తొలగించడం జరిగింది. అయితే రోడ్లను మాత్రం ఇప్పటికీ పునర్నిర్మించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. గ్రామ పంచాయితీ సర్పంచ్‌గా కాంగ్రెస్‌పార్టీకి చెందిన డాకవరం బుజ్జయ్య ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. సర్పంచ్ పంచాయితీ పరిధిలో వున్న గ్రామాలలో పర్యటించి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేయడం లేదన్న విమర్శలు వున్నాయి. ఈ నేపథ్యంలో పంచాయితీలోని సమస్యలు, జరిగిన అభివృద్ధిపై పలువురి అభిప్రాయాలు ఈ విధంగా వున్నాయి.



### అభివృద్ధికి కృషి!

గ్రామ పంచాయితీని మరింత అభివృద్ధి చేసేందుకు నావంతు కృషి చేస్తున్నాను. పంచాయితీ పరిధిలోని ఏ మజరా గ్రామంలోనైనా సమస్య వుందని నా దృష్టికి తెచ్చిన వెంటనే సిబ్బందిని పంపి పరిష్కరించడం జరుగుతోంది. డ్రైనేజి కాల్వల నిర్మాణం, పూడికతీత పనులు జరుగుతున్నాయి.

– సి.వెంకటేశ్వర్లు, పంచాయితీ కార్యదర్శి



### డ్రైనేజి అధ్వాన్నం!

అల్లూరులో డ్రైనేజి కాల్వలు చాలా అధ్వాన్నంగా వున్నాయి. రోడ్లను విస్తరించేందుకు ఆక్రమణలు తొలగించిన అధికారులు వాటి గురించి పట్టించుకోవడం లేదు. కొద్దిపాటి వర్షానికే మురికి నీరంతా రోడ్లపైకి చేరిపోతోంది. నడిచేందుకు ఇబ్బందికరంగా వుంటోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లు, డ్రైనేజి కాల్వలను నిర్మించాలి.

– షేక్ నాయబ్



ఎదుగు బొదుగులేని అల్లూరు గ్రామ పంచాయితీ.



దుస్థితిలో అల్లూరు మెయిన్‌రోడ్డు.

---

అవినీతి కథ

# పెన్షన్ల పంపిణీలో చేతివాటం!



అవినీతికి కేంద్రం ఇందిరక్రాంతి పథక కార్యాలయం.

జిల్లాలో వృద్ధాప్య, వితంతు, వికలాంగులకు ప్రతి నెల పంపిణీ చేస్తున్న సాంఘిక భద్రత పెన్షన్లలో కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. దారిద్ర్యరేఖకు దిగువన వున్న వారికి ప్రభుత్వం ప్రతినెల 200 రూపాయలు పెన్షన్ క్రింద మంజూరు చేస్తుంది. ప్రభుత్వం మంజూరు చేసిన పెన్షన్లను ఇందిర క్రాంతి పథం ద్వారా పంపిణీ చేయడం జరుగుతుంది. ఇందిర క్రాంతి పథం సిబ్బంది గ్రామీణ ప్రాంతాలలోని సంఘ బంధం సభ్యుల చేత పంపిణీ చేయిస్తుండడం వల్ల కొందరు లబ్దిదారుల నుంచి కమీషన్ తీసుకుంటున్నారు.

వృద్ధాప్య, వితంతు పెన్షన్ల మంజూరుకోసం ఎన్నో సంవత్సరాల నుంచి కార్యాలయాల చుట్టూ తిరిగి మంజూరు చేయించుకుంటే పెన్షన్ నగదు ఇచ్చే సమయంలో కమీషన్లు తీసుకోవడం సిగ్గుచేటు. ప్రతినెల ఒకటవ తేది నుంచి 5వ తేదిలోగా గ్రామీణ ప్రాంతాలలో పెన్షన్లు పూర్తిగా పంపిణీచేసి 6వ తేది ఇందిర క్రాంతి పథం కార్యాలయానికి నివేదికలు పంపాల్సి వుంటుంది. పంచాయితీ పరిధిలో వున్న గ్రామాలకు సంఘ బంధం సభ్యులు తప్పకుండా వెళ్లి పెన్షన్ అందజేసి సంతకాలు తీసుకోవాలి.

జిల్లాలోని కొన్ని గ్రామ పంచాయితీ కార్యాలయాల్లో పెన్షన్లు పంపిణీ చేస్తున్నారు. పంచాయితీ పరిధిలో వున్న మిగిలిన గ్రామాలకు వెళ్లకుండా లబ్దిదారులనే పంచాయితీ కార్యాలయానికి పిలిపించి పెన్షన్ నగదు అందజేస్తున్నారు. మూడు, నాలుగు కిలోమీటర్ల దూరంలో వున్న గ్రామాల నుంచి పంచాయితీ కార్యాలయానికి రావడం కష్టతరంగా వుంటుంది. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు ఇబ్బంది పడుతున్నారు. పెన్షన్ కోసం పంచాయితీ కార్యాలయానికి వచ్చినాకూడా సంఘ బంధం సభ్యులకు కమీషన్లు ఇవ్వక తప్పడం లేదని లబ్దిదారులు వాపోతున్నారు. ఈ విషయం సంబంధిత ఇందిర క్రాంతి పథం సిబ్బందికి తెలిసినా కూడా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఇటువంటి సంఘటనలు ముఖ్యంగా అల్లూరు మండలంలోని పురిణి గ్రామ పంచాయితీలో చోటుచేసుకుంటున్నాయి. ఈ పంచాయితీ పరిధిలో సుబ్బరాయుడుతోపు, మందిరం, తుఫాన్‌నగర్, కొత్తపాళెం మజరా గ్రామాలు వున్నాయి. పై గ్రామాలలో పెన్షన్ పంపిణీ సక్రమంగా జరగడం లేదు. ఈ గ్రామాలలో సంఘ బంధం లేకపోవడం వల్ల పురిణి గ్రామంలో వున్న సంఘ బంధం సభ్యులకు పెన్షన్లు పంపిణీ చేసే బాధ్యతను అధికారులు అప్పగించడం జరిగింది. మిగిలిన గ్రామాలలో స్వయం సహాయక సంఘాలు వున్నప్పటికీ వీటన్నింటినీ కలిపి సంఘ బంధం చేయడానికి చర్యలు తీసుకోవడం లేదు.

> “ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం సంఘ బంధం సభ్యుల అవినీతి, అక్రమాల కారణంగా జిల్లాలో అగుడుపట్టి పోతోంది. ”

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం కొంతమంది సంఘ బంధం సభ్యుల అవినీతి, అక్రమాల కారణంగా సక్రమంగా కొనసాగడం లేదు. కొన్ని ప్రాంతాలలో అయితే పెన్షన్లు పంపిణీ చేయకుండానే పంపిణీ చేసినట్లు రికార్డులలో చూపుతున్నారు. అధికారులు జరిపిన పరిశీలనలో ఇటువంటి అక్రమాలు గతంలో పలు మండలాల్లో బయటపడ్డాయి. తోటపల్లిగూడూరు మండలం వరిగొండ పంచాయితీ పరిధిలో మరణించిన వారి పేరుతో పెన్షన్ అందజేసిన విషయం అప్పటి మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి గుర్తించింది. ఇది కేవలం ఉదాహరణ మాత్రమే. ఇటువంటివి జిల్లావ్యాప్తంగా అనేకం వున్నాయి.

పెన్షన్ల పంపిణీ కార్యక్రమంపై ఇందిర క్రాంతి పథం అధికారులు పర్యవేక్షణ చేయకపోవడం వల్ల గ్రామాలలోని సంఘ బంధం సభ్యులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఇందిర క్రాంతి పథం ప్రాజెక్టు డైరక్టర్‌లు స్పందించి సమగ్ర పరిశీలన చేయాల్సిన అవసరం ఏర్పడింది. లేకుంటే ఈ కార్యక్రమం మరింత లోపభూయిష్టంగా మారే ప్రమాదం వుంటుంది.

# చట్టాలపై అవగాహన ఏది?




చైతన్యం రగిలించని జిల్లా పోలీసు కార్యాలయం.

జిల్లాలో ప్రతిరోజు ఏదో ఒక ప్రాంతంలో మహిళలపై వరకట్న వేధింపులు, అత్యాచారాలు, అత్యాచార యత్నాలు జరుగుతూనే వున్నాయి. మహిళలపై జరుగుతున్న వేధింపులకు సంబంధించిన చట్టాలపై పూర్తి అవగాహన కల్పించాలని ప్రభుత్వ ఉత్తర్వులు వున్నాయి. అలాగే అట్రాసిటీ కేసుల విషయంలో కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా బాధితులకు న్యాయం చేసేందుకు తగినచర్యలు తీసుకోవాల్సిన పోలీసు, రెవిన్యూ అధికారులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అట్రాసిటీ, అత్యాచారాల కేసులను వెంటనే నమోదు చేయకుండా రాజీల పేరుతో పోలీస్‌స్టేషన్ల చుట్టూ త్రిప్పుతుంటారు. జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించిన విషయాలపై మూడు నెలలకోసారి జిల్లా కలెక్టర్ సమీక్ష చేస్తుంటారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగే ప్రతి సమావేశంలో జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు వరకట్నం, అత్యాచారం, వేధింపులు నివారించేందుకు చట్టాలపై పూర్తి అవగాహన కల్పించాలని చెబుతుంటారు. అయితే ఆచరణలో ఎక్కడా కలెక్టర్ ఆదేశాలు అమలు చేయడం లేదు. అవగాహన సదస్సులకు స్వయం సహాయక బృందాలు, స్వచ్ఛంద సంస్థలు, ఆశ వాలంటీర్లను ఆహ్వానించాలి. అత్యాచార చట్టాల గురించి తెలిపే కరపత్రాలు ముద్రించి గ్రామీణ ప్రాంతాలలో పంపిణీ చేయాల్సి వుంటుంది. రెవిన్యూ డివిజన్ అధికారి, డిఎస్పీ, సమగ్ర శిశు అభివృద్ధి పథకం అధికారుల సమన్వయంతో కమిటీ ఏర్పాటుచేయాల్సి వున్నా ఇంతవరకు వీటి గురించి పట్టించుకున్న దాఖలాల్లేవు. అలాగే పోలీస్‌స్టేషన్లలో అత్యాచార కేసులను పరిష్కరించేందుకు సైకాలజిస్టు, అడ్వకేటు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వుండేటట్లు ఏర్పాటు చేసుకోవాలి. కేవలం కొన్ని కేసులు మాత్రమే నమోదుచేసి బాధితులకు ఎంతో కొంత ఆర్థిక సహాయం అందిస్తున్నారే తప్ప నిందితులకు శిక్షలుపడే విధంగా చర్యలు వుండడంలేదు. ఇప్పటి వరకు జిల్లాలో 565 కేసులు పెండింగ్‌లో వున్నాయి. వీటిని ఎప్పటిలోగా పరిష్కరిస్తారో వేచి చూడాలి.

# మూఢ నమ్మకాలు విడనాడండి



జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభలో మాట్లాడుతున్న అంతర్జాతీయ మానవవాద నాయకుడు గోగినేని బాబు.

మూఢ నమ్మకాలను జనం విడనాడాలని, ప్రతిఒక్కరు శాస్త్రీయ భావజాలాన్ని అలవర్చుకోవాలని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ విజయకుమార్ సూచించారు. 3వ తేది జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభలో మాట్లాడుతూ పర్యావరణంలో కార్బన్ డయాక్సైడ్‌ను తగ్గించాలని అప్పుడే భూగోళం బతికి బట్టకడుతుందన్నారు. అంతర్జాతీయ మానవవాద నాయకుడు గోగినేని బాబు మాట్లాడుతూ మూఢ నమ్మకాల వల్ల రాష్ట్రంలో పలు రుగ్మతలు చోటుచేసుకొంటున్నాయన్నారు. మూఢనమ్మకాలు పోవాలంటే పాఠ్యాంశాలలో భాగంగా చిన్నపిల్లలకు చిన్నప్పటి నుంచే అవగాహన కల్పించాలన్నారు. డాక్టర్ బాబురావు "పర్యావరణం కోస్తా తీరంపై" అన్న అంశంపై మాట్లాడిన మాటలు ఆలోచింపజేశాయి. జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణ, డాక్టర్ శ్రీనివాసులు, శ్రీధర్‌బాబు, ఎం.సతీష్ కుమార్, డి.సుధీర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సభలో వక్తల ఉపన్యాసాలు సభికులను ఆలోచింపజేశాయి.

# ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారు

## కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆవేదన



సమైక్యాంధ్ర కోరుతూ ఐక్యవేదిక ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి. ప్రక్కన నగర ఎమ్మెల్యే శ్రీధర్‌కృష్ణారెడ్డి, ఆచార్య ఆదిత్య.

సీమాంధ్ర విద్యార్థులను తెలంగాణ నేతలు దొంగలు, దోపిడీదారులుగా చిత్రీకరించి మాట్లాడడం దారుణమని పిసిసి సభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. 3వ తేది రాజీవ్‌భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ సీమాంధ్రుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తూ నాయకులు చేస్తున్న వాఖ్యలపై సరైన సమాధానం చెప్పను ముఖ్యమంత్రి రోశయ్య తక్షణం అసెంబ్లీని సమావేశపర్చాలన్నారు. అసెంబ్లీలో చర్చకు పెడితే స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ ప్రాంతానికి ఎన్ని నిధులు వచ్చాయి. ఏ ప్రాంతానికి ఎన్ని పరిశ్రమలు వచ్చాయి. ఏ ప్రాంతానికి ఎన్ని ప్రాజెక్టులు వచ్చాయన్న విషయం బయటపడుతుందన్నారు. 1956 వరకు తెలంగాణలో 17 లక్షల ఎకరాలకు నీరందిస్తుంటే 2009 నాటికి ఈ స్థాయి 27 లక్షల ఎకరాలకు చేరిందన్నారు. ఈ దామాషా అభివృద్ధి సీమాంధ్రలో లేదన్నారు. 1996 జూలై 18వ తేదిన తెలంగాణాపై కెసిఆర్ అసెంబ్లీలో మాట్లాడిన మాటలు గుర్తుకు తెచ్చుకొంటే ఆయన ద్వంద్వవైఖరి బయటపడుతుందన్నారు. రాయలసీమ నేతలు కొన్నాళ్లు నోళ్లు అదుపులో పెట్టుకొంటే మంచిదని శ్రీధర్‌రెడ్డి సలహా యిచ్చారు.

• పెచ్చుపెరిగిన

# మహిళల ఆత్మహత్యలు

మహిళలు పురుషులతో సమానంగా, కొన్ని సమయాల్లో వారికంటే ధీటుగా తమశక్తి సామర్థ్యాలను చాటుతూ అబలలం కాదు సబలలం అని నిరూపిస్తుంటే మరోవైపు మహిళల ఆత్మహత్యలు హెచ్చుమీరుతున్నాయి. కుటుంబంలో గొడవలు, వరకట్న వేధింపులు, అనుమానాలు, అవమానాలతో మనసు గాయపడి జీవితంపై విరక్తితో ప్రాణం తీసుకొంటున్న వారి సంఖ్య జిల్లాలో అధికమైంది. ఇటీవల పలుచోట్ల జరిగిన ఘటనలు దీనిని తెలియజేస్తున్నాయి. భార్యాభర్తల మధ్య అవగాహన లేకపోవడం, ఇతరత్రా సమస్యలతో తనువు చాలించే వారి సంఖ్య పెరుగుతోంది. వెంకటాచలంలో ఇరువురు మహిళలు రెండు రోజుల క్రిందట ఆత్మహత్యలకు పాల్పడడం ఈ పరిస్థితిని తెలియజేస్తుంది. ఆత్మహత్యల కేసులు కొన్ని పోలీస్‌స్టేషన్లకు వస్తుండగా, మరికొన్ని గ్రామపెద్దలే మధ్యవర్తిత్వం చేసి చక్కబెడుతున్నారు. మహిళలు క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడడం వీరి మానసిక సంఘర్షణల తాలుకు ఫలితం అని, చిన్న చిన్న స్పర్థలకు ప్రాణం తీసుకోవడం వారి మానసిక బలహీనతను తెలియజేస్తుందని మానసిక వైద్యులు చెప్తున్నారు. ఇలాంటి వారికి కౌన్సిలింగ్ నిర్వహించడం ద్వారా ఫలితం వుంటుందని, చుట్టుప్రక్కల వాళ్లు ఇలాంటి వారికి తగిన మనో ధైర్యం కల్పించినట్లయితే అబలల ఆత్మహత్యలు తగ్గుతాయని చెప్తున్నారు.



ఒంగోలులో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేస్తున్న పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి.



నెల్లూరు పోలీస్ డైరీని ఆవిష్కరిస్తున్న ఎస్పీ మల్లారెడ్డి. ప్రక్కన ఏఎస్పీ కనకారావు, డిఎస్పీ రాధిక, పోలీసుల అధికారుల సంఘం నాయకులు మాధవరెడ్డి, గంగాధర్.

## ఇవ్వమని చెప్పేదీ లేదు!

మొదటి పేజీ కొరవ

హార దీక్షలో వున్న నన్ను గట్టెక్కించడానికి డిసెంబర్ 9తేది ప్రకటన చేశాను. అది నన్ను గొంతులోతు వూబిలోకి నెట్టింది. దాని నుంచి బయటపడా లంటే, సహకరించక తప్పదు. కాదు కూడదని మంకుపట్టు పడితే పరిస్థితులు కఠినంగా వుంటా యని సుతిమెత్తగా హెచ్చరిక కూడా చేశాడట. దానితో కెసిఆర్ కూడా ఆలోచనలో పడ్డాడు.

## ఉద్యమం ఆగుతుందా?

అయితే చిదంబరం, కెసిఆర్‌లు కలిసి కూర్చుని మాట్లాడుకొన్నంత మాత్రాన తెలంగాణ ఉద్యమం ఆగుతుందా అన్నది ప్రశ్న. తెలంగాణ ఉద్యమం ఆయన అదుపులో లేదు. అందులో అన్ని పార్టీలు తలదూర్చి వున్నాయి. కెసిఆర్‌ను ఒప్పించి నంత మాత్రాన, విద్యార్థి సంఘాలు, తెలుగుదేశం వంటి పార్టీలు వూరుకోవు. తమ దారిన తాము ఉద్యమాన్ని కొనసాగిస్తారు. అదే జరిగితే కెసిఆర్‌కు రాజకీయ భవిష్యత్తు వుండదు. చిదంబరానికి కూడా శాంతి దొరకదు. కానీ ఇద్దరూ కలిసి ఒక ప్రయత్నం చేస్తున్నారు. దాని ఫలితం ఎట్లా వుం టుందో ఇప్పుడే వూహించడం కష్టం.

## మరింత ప్రమాదం

తెలంగాణ ఉద్యమం కెసిఆర్ నాయకత్వం నుంచి చేజారి, విద్యార్థి సంఘాల సారథ్యానికి వెళ్లడం వల్ల చాలా అనర్థాలున్నాయి. కెసిఆర్ చాలా గొప్ప రాజకీయ మేధావి. ఎప్పుడెట్లా మాట్లాడాలో, ఎప్పుడే ఎత్తు వేయాలో ఆయనకు బాగా తెలుసు. అందువల్లనే గత పదేళ్లుగా ఉద్యమం నడుపుతున్నా పరిస్థితి అదుపు తప్పలేదు. ఆంధ్ర, తెలంగాణల ప్రజల మధ్య విద్వేషాలు, విబేధాలు తలెత్తకుండా చాలా జాగ్రత్తగా, నిగ్రహంతో ఉద్యమం నడుపుతు న్నాడు. కానీ విద్యార్థులకు అంత సహనం వుండ దని గత నెలరోజుల పరిణామాలు సూచిస్తున్నాయి. లగడపాటి రాజగోపాల్ మాటలకు రెచ్చిపోయిన విద్యార్థులు తెలంగాణలోని ఆంధ్రవాసులలో భీతా వహ పరిస్థితి కల్పించివేశారు. రెండు ప్రాంతాల మధ్య అగాధం సృష్టిస్తున్నారు. శత్రుత్వ భావనలు పెంచుతున్నారు. చాలా ప్రమాదకర ధోరణి అది. కోట్లాది ప్రజల జీవితాల మీద దాని ప్రభావం ఘోరంగా వుంటుంది. తాత్కాలికంగా సమస్యను వెనక్కు నెట్టడానికి చేసే ప్రయత్నాలు, ఉద్యమానికి సరైన నాయకత్వం లేని పరిస్థితి కల్పించడం ఇప్పటి వరకు చేసిన పొరపాట్లకంటే పెద్ద ప్రమాదం అవు తుందన్నది నిజం.

## కాంగ్రెస్‌వాదుల ముక్కుకు తాడు

కెసిఆర్‌ను దారికి తెచ్చుకోవడానికి ఒక వంక ప్రయత్నం చేస్తూనే మరొకప్రక్క కాంగ్రెస్‌వాదులకు ముక్కుతాడు వేయడానికి కూడా ప్రయత్నం చేస్తు న్నది కేంద్ర నాయకత్వం. అఖిలపక్ష సమావేశానికి హాజరైన కెఎస్.రావు, ఉత్తమ కుమార్‌రెడ్డిలిద్దరికీ వారొక హెచ్చరిక చేశారట. సమావేశంలో మీరు ఏ వాదన అయినా విన్పించండి, దానికి ముగింపుగా మాత్రం అధిష్టానం ఏ నిర్ణయం తీసుకొన్నా కట్టు బడి వుంటామని చెప్పండని సూచించారట. ఇదేమి మెలిక, అంతమాత్రానికి మేము సమావేశానికి రావ డం ఎందుకని చిరాకుపడ్డాడట ఉత్తమకుమార్‌రెడ్డి. ఆ వెంటనే అహ్మద్‌పటేల్ నుంచి ఆయనకు ఫోన్ వచ్చింది, చెప్పినట్లు వినకుంటే ఇబ్బందులలో పడ తావు అని, దానితో ఇద్దరు కాంగ్రెస్ ప్రతినిధులూ సమావేశం చివర, తాము కేంద్ర నిర్ణయానికి కట్టు బడి వుంటామని ప్రకటించక తప్పలేదు.

## లగడపాటి తెగింపు

అయితే కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రామిరెడ్డి దామోదరరెడ్డి, లగడపాటి రాజగోపాల్‌రెడ్డి, మధు యాష్కీ వంటి నేతల ధోరణి అధిష్టానానికి చెడ్డ కోపం తెప్పిస్తున్నది. లగడపాటి విషయంలో సోనియాగాంధీ కూడా చిరాకు పడుతున్నట్లు సమా చారం. ఆయన నోటికి అడ్డు వుండడం లేదు. టివి ఛానళ్లకు నిముషాల లెక్కలో డబ్బిచ్చి, ఇష్టం వచ్చి నట్లు మాట్లాడుతున్నాడు. రెండు ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చి పోవడానికి, తెలంగాణ ప్రాం తంలో ఆంధ్రుల మీద దాడులు జరగడానికి రాజ గోపాల్ వాచాలత్వం ఒక కారణమని కేంద్రం భావి స్తున్నది. అయితే కేంద్ర నాయకుల మాట విన్పించు కొనే ధోరణిలో లగడపాటి లేడు. ఒక విధమైన తెగింపు ప్రదర్శిస్తున్నాడు. రాష్ట్రస్థాయిలో తానొక నాయకుడిగా గుర్తింపు పొందడానికి ఇదొక సదవ కాశమని ఆయన భావన. ఆయన కాళ్లకు బంధాలు ఎట్లా వేస్తారో, ఎప్పుడు వేస్తారో కాంగ్రెస్ పెద్దలే నిర్ణయించాలి.

---

## రోశయ్య

16న పేజీ కొరవ

భావన ప్రబలితే రాష్ట్రం అరాచకమయం కాదా? దానికి ఎవరు బాధ్యత వహిస్తారు? నిర్ణయం తీసు కోవాల్సిన సమయంలో ఉదాసీనంగా వుండిపో వడం ముఖ్యమంత్రి చేస్తున్న మహాపరాధం. కెసిఆర్ నిరాహార దీక్ష, డిశంబర్ 10 తేది విద్యార్థుల అసెంబ్లీ ముట్టడి సంఘటనలపై కేంద్రానికి సరైన సమాచారం అందించి వుంటే, ఈ సవాలును నేను పరిష్కరించగలనని హామీ ఇచ్చి వుంటే రాష్ట్రం ఉద్యమాలతో అట్టుడికే పరిస్థితి ఏర్పడేది కాదు. విద్యార్థుల అసెంబ్లీ ముట్టడి చైనాలోని తియాన్ మెన్ స్క్వేర్ విప్లవం వలె ఉధృతంగా వుండబోతున్న దని, వందలాది శవాలు గుట్టలుగా పడతాయని కె.కేశవరావు వంటి వారు కేంద్ర నాయకులను భయపెడుతుంటే, తాను నిమిత్తమాత్రుడన్నట్లు వుండి పోయాడాయన. అందువల్లే చిదంబరం తొం దరపడి తెలంగాణ ప్రకటన చేశాడు. రాష్ట్రాన్ని ఉద్య మాల అగ్నిగుండంగా మార్చాడు. ఈ సమస్య నుంచి బయటపడడానికి రాష్ట్రానికి ఎన్నేళ్లు పడు తుందో ఎవరూ ఊహించలేకున్నారు.

అధికారులు తానిచ్చే ఉత్తర్వులు బేఖాతరు చేస్తున్నారని, తన మాటలు పట్టించుకోవడం లేదని తెలిసినప్పుడు ముఖ్యమంత్రిగా ఒక్క గద్దింపు చేస్తే అంతా సర్దుకొంటుంది. కానీ ఆ పని చేయలేక పోతు న్నాడు. మంత్రుల విషయంలోనూ అంతే. కాల కృత్యాలు తీర్చుకోవాలన్నా ఢిల్లీ నుంచి ఫోన్ అను మతి లేదన్నట్లు వ్యవహరిస్తున్నాడు ముఖ్యమంత్రి. ప్రతి పనికీ, ప్రతి వ్యవహారానికీ ఢిల్లీ వైపు తిరిగి చూస్తున్నాడు. వారు చెప్పింది మాత్రమే చేస్తున్నాడు. అందులో తప్పులున్నా తనకు సంబంధం లేదంటు న్నాడు. ఈ పద్ధతిలో ముఖ్యమంత్రి నడిస్తే, రాష్ట్రం గతి అధోగతి కావడం తప్ప జరిగేది ఏమి వుంటుంది?

రోశయ్యగారు ఒక్క నిముషం తన ప్రవర్తనను ఆత్మవిమర్శ చేసుకుంటే, ఒక్క క్షణం రోషం తెచ్చు కొంటే ఆయన్ను మించిపోయే బ్రహ్మ పదార్థమేమీ కాదు రాష్ట్రపాలన. ఆయనలో ఆ రోషం ఎప్పుడు వస్తుందోనని ఎదురు చూడడం తప్ప మనం చేయగలిగింది ఏదీ లేదు.

---




కొత్త పిఆర్‌సిని అమలు చేయాలని కోరుతూ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ నేతృత్వంలో నెల్లూరులో జరిగిన ప్రదర్శన.

## జనవాణి

2వ పేజీ కొరవ

కీర్తనలు ఆపరాబాబూ అంటాడు. ఇదేనా మన సంస్కృతి? నాగరికత? సమభావం? ప్రభుత్వం టీవీ ఛానళ్లను నియంత్రించే వ్యవస్థ పెట్టకపోతే సమా జంలో రుగ్మతలు పెరగడం ఖాయం.

పి. అరుణకుమారి, నెల్లూరు

### లాంగ్‌లివ్ జమీన్‌రైతు!

డిసెంబర్ 22తేదీ ఈనాడు దినపత్రిక 'ప్రతిభ' కాలమ్‌లో ఎపిపిఎస్‌సి గ్రూప్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం 'జమీన్‌రైతు' పత్రిక గూర్చి ప్రచురించిన ప్రత్యేక వ్యాసం చదివి ఆనం దించాను. రాష్ట్రవ్యాపితంగా ఆనాడు జమీందారుల అకృత్యాలను 'జమీన్‌రైతు' ఎలుగెత్తి చాటి జాతిపిత మహాత్మాగాంధీని సైతం ఆలోచింప చేయడం మామూలు విషయమేమి కాదు. స్వర్గీయ నెల్లూరు వెంకట్రామనాయుడు ప్రారంభించిన స్ఫూర్తితోనే నేటికి 'జమీన్‌రైతు' నడవడం ముదావహం.

విస్సా రామచంద్రరావు, విశాఖపట్నం

---

## నక్సల్స్‌భూతం

మొదటి పేజీ కొరవ

అధికులు నక్సల్ సానుభూతిపరులే అని గవర్నర్ తేల్చి చెప్పాడట. కోట్లాది రూపాయల నిధులు దండుతున్నారని, వీరిని నిర్దాక్షిణ్యంగా అణిచి వేయ కుంటే రాష్ట్రం మరొకసారి నక్సల్ గుప్పెట్లో చిక్కుక పోతుందని, కాంగ్రెస్, టిఆర్ఎస్‌లకు చెందిన నాయ కులే వీరికి నిధులు అందేట్లు చూస్తున్నారని, అం దులో మధుయాష్కీ పాత్ర మరింత అధికంగా వుం దని ఆ నివేదికలో తేల్చి చెప్పినట్లు తెలుస్తున్నది. తెలంగాణ రాష్ట్ర విభజన భావోద్వేగాల సమస్యగా కాకుండా నక్సల్స్ తీవ్రవాద ప్రమాదంగా చిత్రీకరిం చడం నరసింహన్ నివేదిక సారాంశం. పచ్చకామెర్ల రోగికి ప్రపంచమంతా పచ్చగా కన్పించినట్లు పోలీసు అధికారిగా జీవితం గడిపిన నరసింహన్‌కు దేన్ని చూసినా శాంతిభద్రతల సమస్యగా మాత్రమే కన్పిం చడంలో విచిత్రం ఏదీ లేదు. ఇప్పటికే తెలంగాణ విషయంలో తప్పు మీద తప్పులు చేసి, గందర గోళంలో పడి వున్న చిదంబరం ఆ నివేదికతో మరింత భీతావహుడైనట్లు చెప్తున్నారు.

---

## నెల్లూరు ముచ్చట్లు

3వ పేజీ కొరవ

### వణికిస్తున్న చలి

నెల్లూరీయులను చలి వణికిస్తుంది. హేమంత ఋతువు కావడం ఉదయం, సాయంత్రం పొగమంచు కమ్మేస్తుండడంతో రోడ్లపై వాహనచోదకులు నానాపాట్లు పడాల్సి వస్తున్నది. మంచు కురిసేవేళలో నెల్లూరులో వ్యాధులు విజృంభించడంతో జనం అల్లాడిపోతున్నారు.

### ఎక్సైజ్ సూపరింటెండెంట్

కొత్త ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఎస్ఎంకె బాష నియమి తులయ్యారు. గతంలో ఈయన నెల్లూరులోని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ ఎ.ఇ.ఎస్‌గా పనిచేసేవారు. పాత ఎక్సైజ్ సూపరింటెండెంట్ వివేకానందరెడ్డికి ప్రమోషనయితే ఇచ్చారుగాని పోస్టింగ్ ఇవ్వలేదు.

### సాయిబాబాకు వెండి కిరీటం

నెల్లూరు గాంధీనగర్‌లోని సాయిబాబా మందిరంలోని సాయినాధునికి గుర్రం కోటేశ్వరరావు, భవాని దంపతులు అర కిలో బరువుతూగే వెండి కిరీటాన్ని చేయించి 1వతేది మందిరం ఛైర్మన్ మన్నెం అమరనాధరెడ్డికి అందించారు.

**మరువలేము నాన్న...**



షేక్ మహబూబ్ సాహెబ్
(మహబూబ్ క్లాత్ మర్చంట్స్)
అల్లూరు.

**ఆరవ వర్ధంతి (బర్సీ)**
**13.1.2010 సందర్భంగా**
శ్రద్ధాంజలి ఘటిస్తూ..

కుమారుడు ... అల్లూరు రహీం
సబ్ ఎడిటర్
జమీన్‌రైతు, నెల్లూరు.
కోడలు ... గౌసున్నీసా బేగం
మనుమడు ... ఆషిక్

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/09-11

● పగ్గాలు లేని పాలనతో ప్రజల అగచాట్లు

# రోశయ్యకు రోషమొచ్చేదెప్పుడు?

## ఊహించని పదవి పొందిన మహర్జాతకుడు, పరిస్థితులు అనుకూలించని మహా దురదృష్టవంతుడు.

ముఖ్యమంత్రిగా కొణిజేటి రోశయ్య ప్రభుత్వ పెత్తనం స్వీకరించి నాలుగు నెలలు గడిచిపోయాయి. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ అధినేతలేని అనాథ వలె దీనంగా కన్పిస్తున్నది. తాను ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిననే స్పృహ రోశయ్యగారిలో వుందో లేదో తెలియదు కానీ, రాష్ట్ర ప్రజలకు మాత్రం ఆయన్ను చూస్తే ఆ భావన కలగడం లేదు. ఆయన పని తీరు చూస్తే గౌరవం కూడా మిగలడం లేదు.

రోశయ్య నోట్లో వేలుపెడితే కొరకలేని రాజకీయ పసిబాలుడేమీ కాదు. యాభై ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో ఎన్నో ఆటుపోట్లు అనుభవించిన యోధుడు. ఉన్నత పదవులు నిర్వహించిన అనుభవజ్ఞుడు. ఘాటాలు తిన్న ఘటికుడు. ఆయనకు పరిపాలన తెలియదనేవారు, చేతకాదనేవారు వెర్రోళ్ల క్రింద లెక్క. కానీ ఆయన పాలన చూస్తున్న వారు మాత్రం ఇదేమి ఘోరమని నోరెళ్లబెట్టక తప్పడం లేదు. ఈ నాలుగు నెలల కాలంలో ఒక్కటంటే ఒక్క సందర్భంలో కానీ, ఒక్కటంటే ఒక్క సమయంలో కానీ రాష్ట్రంలో పరిపాలన నడుస్తున్న భావన కల్పించలేక పోతున్నాడు రోశయ్య. చాలా దురదృష్టకరమైన పరిస్థితి.

నిజానికి పార్టీపరంగా, ప్రభుత్వపరంగా ఆయనకు ఆటంకాలు ఏవీ లేవు. వైఎస్‌జగన్ వంటి అసమ్మతి వాదులెందరున్నా, కొండంత అండగా అధిష్టానం వుంది. ఆయనకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. ఏ నిర్ణయం తీసుకొన్నా సరే అనడం కాదు. ఏ నిర్ణయమూ తీసుకోకపోయినా ఆ తప్పుల భారం తాను మోయడానికి సిద్ధపడుతున్నది. ఎంతో అదృష్టం చేసుకుంటే తప్ప కాంగ్రెస్ అధిష్టానం నుంచి ముఖ్యమంత్రులకు ఇటువంటి సమర్థన దొరకదు. కానీ ఏమి లాభం. వులవల మేత తినిపించినా, కొరడాతో కొట్టి హింసించినా కొయ్య గుర్రం ఎగరలేదు కదా?

మొదటి నెల రోజులు వైఎస్ జగన్ గోలతో ఏ పనీ చేయకుండా కాలక్షేపం చేశాడు. రెండవ నెలలో వరదలొచ్చి ప్రాణం తోడేశాయి. మూడవ నెలలో కెసిఆర్ దీక్షకు కూర్చొని ఆగం చేశాడు. నాలుగవ నెలలో సమైక్య ఆంధ్ర పేరిట అలజడి రేగింది. ముఖ్యమంత్రి అనే వాడికి ఇటువంటి సమస్యలు రావడం సాధారణం. కానీ అన్నీ ఒక దాని వెంట ఒకటిగా వచ్చిపైన పడడమే ఆయన దురదృష్టం. తాను జన్మలో వూహించని ఉన్నత పదవి దక్కించుకొన్న మహర్జాతకుడు రోశయ్య. అదే సమయంలో ఆ భోగం అనుభవించడానికి పరిస్థితులు అనుకూలించని మహా దురదృష్టవంతుడు కూడా.

అయితే ముఖ్యమంత్రి స్థానంలో కూర్చున్న వాడికి ఇటువంటి సమస్యలు, సవాళ్లు సర్వ సాధారణం. వాటిని నిబాయించుకొని, నెగ్గుకొచ్చిన వాడే నిజమైననేతగా గుర్తింపు పొందుతాడు. ఆ కోణంలో చూస్తే మాత్రం రోశయ్య ప్రవర్తన నిరాశ కల్గిస్తున్నది. ఈ సమస్యలు ఒక ప్రక్కవున్నా, నిత్య పాలన సజావుగా జరిపించడానికి ఆటంకం కావు. అదే జరగడం లేదిప్పుడు. అధికారులు మాట వినడం లేదు. ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదు. మంత్రులు లెక్క చేయడం లేదు. పార్టీ కార్యకర్తలలో ఉత్సాహం లేదు. కనీసం ప్రతిపక్షానికి కూడా తిట్టాలన్న ఆసక్తి కలగడం లేదు. దాన్ని బట్టి రాష్ట్రంలో పరిపాలన ఎంతగా నీరుగారిపోయినదో అర్థం చేసుకోవచ్చు. పాలన పగ్గాలు తప్పితే ప్రజలకు మిగిలేది అగచాట్లే కదా? ఇప్పుడదే జరుగుతున్నది. పెరిగే ధరల మీద అదుపు లేదు. కొత్తగా ప్రభుత్వమే పన్నులు, ఛార్జీలు పెంచుతున్నది. దానితో ధరలు మరింత ఆకాశపు దారి పట్టడం ఖాయం. తెలంగాణ, సమైఖ్యాంధ్ర ఉద్యమాలతో జనానికి శాంతి లేకుండా పోతున్నది. నిత్యం బంద్‌లు, రాస్తారోకోలు, అలజడులతో జనం విసిగి పోతున్నారు. ఏ రోజు ఏ కారణంతో రోడ్లు మూసుకపోతాయో, రైళ్లు నిలచి పోతాయో తెలియడం లేదు. ఒక వూరి నుంచి



బయలుదేరితే అనుకొన్న ప్రదేశానికి చేరే వరకు నమ్మకం లేదు. అంతా అయోమయం. మరొక ప్రక్క ప్రభుత్వ కార్యాలయాలలో కాగితం కదలడం లేదు. ఉద్యోగులలో, అధికారులలో ఆసక్తి లేదు. వారిని అడిగేవాడూ లేడు. అడిగితే సమాధానం చెప్పవలసి వస్తుందన్న భయం అసలే లేదు. మొగల్ సామ్రాజ్య పతనం సమయంలో సామంతు రాజులు ఎవరికి వారు స్వతంత్రం ప్రకటించుకొన్నట్లు ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు తమ చిత్తం వచ్చినట్లు నడుచుకొంటున్నారు. వారిలో ఎంత లెక్కలేనితనం కాకుంటే ఆర్టీసి ఛార్జీల పెంపకం వంటి కీలక, సున్నితమైన రాజకీయ నిర్ణయం ముఖ్యమంత్రికి మాట మాత్రం చెప్పకుండా తీసుకొంటాడు ఎస్ఎస్‌పి యాదవ్?

ఈ నిర్లక్ష్యం ఈ నిరాశక్తత ఎంత కాలం? రాష్ట్రంలో ప్రభుత్వమే లేదన్న భావన ఎన్ని రోజులు? దాని వల్ల ప్రజలకు ఎంత నష్టం? రోశయ్య తలచుకొంటే మొత్తం పరిపాలన దారిలో పెట్టడం పెద్ద కష్టమా? అందుకు ఆయనకు అడ్డువస్తున్నదేమిటి? దేనికోసం, ఎవరి కోసం ఎదురు చూస్తున్నాడాయన? ఎంతకాలం ఓపిక పడతాడు? అంత ఓర్పు ప్రజలలో వుండాలి కదా? పరిపాలన లేదనే

కొరవ 14వ పేజీలో

### కెసిఆర్‌తో రహస్య ఒప్పందం?

కేంద్ర హోంమంత్రి చిదంబరానికి, టిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌కు మధ్య ఒక రహస్య ఒప్పందం కుదిరిందన్న వదంతి తెలంగాణ జిల్లాలన్నిటిలో గుప్పుమంటున్నది. నిప్పు లేనిది పొగరాదు. ఎక్కడో ఒకచోట అనుమానం తలెత్తనిదే ఇటువంటి పుకార్లు షికారు చేయవు. అఖిలపక్ష సమావేశం జరిగిన తర్వాత కెసిఆర్ పాటిస్తున్న వ్యూహాత్మక మౌనం ఈ వదంతులకు వూతం ఇస్తున్నది. తెలంగాణ ఇవ్వడం ఇప్పట్లో సాధ్యం కాదని అర్థం చేసుకొన్న చిదంబరం, ఆ కందిరీగల తుట్టెను కదిలించడమనే పొరపాటు చేసుకొన్నందుకు కెసిఆర్ సమక్షంలో చెంపలేసుకొని, తనను గట్టెక్కించమని ప్రాధేయపడుతున్నట్లు తెలుస్తున్నది. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విషయంలో మనకు అన్యాయం చేయదనే తీరులో కెసిఆర్ ఒక ప్రకటన చేసి, తాత్కాలికంగా ఉద్యమాన్ని ఉపశమింపచేయాలన్నది చిదంబరం కోరిక. అందుకు ప్రతిగా కెసిఆర్‌కు కేంద్రంలో మంత్రిత్వం ఇస్తామని ఆశ చూపించారట. తెలంగాణ వేర్పాటుపై చర్చల ప్రక్రియను కొనసాగించడానికి తాను కేంద్ర ప్రభుత్వంలో చేరడం అవసరమని ఉద్యమకారులను ఒప్పించుకోవడం కెసిఆర్ బాధ్యత. అయితే తెలంగాణ వాదానికి కెసిఆర్ ఒక సంకేతమే తప్ప, ఇప్పుడు ఆ ఉద్యమం ఆయన చేతుల్లో లేదు. ఆయన వద్దంటే ఆగే పరిస్థితి అసలేలేదు. అందువల్ల చిదంబరానిది వృథా ప్రయాసే తప్ప ఈ గందరగోళానికి ఇటువంటి ఒప్పందాలు పరిష్కారం కాబోవు.




ఏ దేశ మేగినా ఎంతెత్తు కెదిగినా
జన్మభూమిని, 'జమీన్‌రైతు'ను
మరవక పోవడం
నెల్లూరీయుల సాంప్రదాయం

పాఠకులకు ప్రత్యేక కానుక

ఎనభైఏళ్లుగా 'జమీన్‌రైతు'ను తమ అభిమాన పత్రికగా ఆదరిస్తున్న పాఠకులకు ఈ కొత్త సంవత్సరంలో ప్రత్యేక కానుకగా "గ్లాస్" బౌల్ సెట్ అందిస్తున్నాము.
1-12-2009 నుండి 31-3-2010 మధ్య కాలంలో
చందా చెల్లించిన వారందరికీ ఈ కానుక అందుతుంది!

సంవత్సర చందా రూ.200/- | జీవిత చందా రూ.1000/-

చందా చెల్లించిన వెంటనే రశీదుతో పాటు కానుక అడిగి తీసుకోండి. ఇతర ప్రాంతాల నుంచి ఎం.ఓ. లేదా డి.డి. (చెక్కులు స్వీకరించబడవు) ద్వారా చందా పంపేవారు స్కీమ్ కాలపరిమితి ముగిసేలోగా మా కార్యాలయానికి వచ్చి కానుక స్వీకరించాలి. కానుకను పోస్టులో పంపడం సాధ్యం కాదు.

జమీన్‌రైతు

వెంకటరమణ హోటల్ మిద్దెపైన, పొగతోట, నెల్లూరు - 524 001. ఫోన్: 0861-2327354

సాహసోపేత వార్తా చిత్రిక - జమీన్‌రైతు వారపత్రిక


Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.